1

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

మెదక్

ఆదివారం | 16 మార్చి 2025 | www.navatelangana.com

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకున్న పోలీసులు



నవతెలంగాణ-సంగారెడ్డి

అసెంబ్లీ నుంచి ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి సస్పెండ్‌ను నిరసిస్తూ బీఆర్ఎ స్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సూచనలతో స్థానిక క్యాంపు కార్యాలయం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు ర్యాలీగా బయలుదేరి సంగారెడ్డి కొత్త బస్టాండ్ వద్ద రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనానికి యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సంగారెడ్డి పట్టణ కార్యదర్శి నరసింహులు మాట్లాడుతూ.. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపుతే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ నాయకులు శ్రీధర్‌రెడ్డి, శ్రవణ్‌రెడ్డిలు మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలను అమలు చేయాలని నిలదీస్తే కక్షపూరితంగా ఎమ్మెల్యేలను సస్పెండ్ చేస్తున్నార న్నారు. ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డిపై వెంటనే సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ, కాంగ్రెస్ చీకటి ఒప్పందంతో బీఆర్ఎస్‌పై కుట్ర చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో పాండు రంగం, అజీమ్, విఠల్, ఆంజనేయులు, సమీ, శేఖర్, పరుశురాం, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్లోనే యువకుడి ఆత్మహత్యాయత్నం



ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు

నవతెలంగాణ-జోగిపేట : జోగిపేట పోలీస్ స్టేషన్లో ఓ కేసు విషయంలో పోలీసులు తనను కొట్టారని ఆరోపిస్తూ ఓ యువకుడు పోలీస్ స్టేషన్‌లోనే ఆత్మహత్యా యత్నం చేసుకున్నాడు. ఈ ఘటన జోగిపేట పోలీస్ స్టేషన్‌లో జరిగింది. బాధితుడు, పోలీసులు తెలిపని వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా జోగిపేట పట్టణానికి చెందిన కడల దాసు, కడల రమేష్ కుటుంబాలు గత రాత్రి ఘర్షణకు పాల్పడ్డాయి. ఈ క్రమంలో రమేష్ పోలీస్ స్టేషన్‌లో దాసు కుటుంబం పై ఫిర్యాదు చేశాడు. దాంతో ఉదయం దాసు, అతని తమ్ముడు శ్రీశైలంలను పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. ఈ క్రమంలో తనను, తన తమ్ముడిని ఎస్సై, పోలీసులు కొట్టారని ఆరోపిస్తూ.. అప్పటికే తన వెంట తెచ్చుకున్న ఎలుకల మందు తాగి దాసు ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. దాంతో అతన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ విషయమై ఎస్ఐ పాండు వివరణ కోరగా.. ఇరు వర్గాలు గత రాత్రి గొడవ చేసుకోవడంతో ఇరు వర్గాలపై కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. దాసు అనే యువకుడుబీర్ సీసాతో పోలీస్ స్టేషన్‌కు వచ్చి విధులకు ఆటంకం కలిగించినందుకు అతనిపై మరో కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

24 గంటల తర్వాత మృతదేహం లభ్యం



నవతెలంగాణ-న్యాల్‌కల్

హెూలీ అనంతరం మద్యం మత్తులో ఓ వ్యవసాయ బావిలో స్నానానికి వెళ్లి నీటిలో గల్లంతైన వ్యక్తి ఆచూకీని ఎట్టకేలకు గుర్తించారు. స్థానిక ఎస్సై చల్లా రాజశేఖర్ పర్యవేక్షణలో.. గజ ఈతగాళ్ళ చొరవతో దాదాపు 24 గంటల అనంతరం మృతదేహన్ని వెలికి తీశారు. ఎస్సై చల్లా రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. న్యాల్‌కల్ మండలం వడ్డీ గ్రామానికి చెందిన గాలమ్మ కుమారుడు శివకుమార్(18) ఈనెల14న గ్రామానికి చెందిన పలువురు స్నేహితులతో కలిసి హెూలీ వేడుకలు చేసుకున్నారు. అనంతరం శంశోల్లాపూర్ గ్రామ శివారులోని దశాబ్దాల కాలం నాటి ఓ వ్యవసాయ బావిలో స్నానానికి వెళ్లారు. శివకుమార్‌కు ఈత రాకున్నా మద్యం మత్తులో బావిలోకి స్నానం కోసమని దిగాడు. ఈ క్రమంలో అతడు నీట మునిగాడు. విషయం తెలుసుకున్న మృతుని కుటుంబీకులు ఘటనా స్థలికి వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రమాదం జరిగిన రోజే చేపలు పట్టే వారు, స్థానికులు నీట మునిగిన వ్యక్తి కోసం తీవ్రంగా గాలింపు చేపట్టారు. రాత్రి వరకు గాలింపు చేపట్టిన ఫలితం లేకుండా పోయింది. తిరిగి శనివారం ఉదయం వడ్డీ గ్రామానికి చెందిన చేపలు పట్టే గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు చేపట్టగా ఎట్టకేలకు మధ్యాహ్నం రెండు గంటల సమయంలో మృతదేహన్ని గుర్తించారు. గుర్తించిన మృతదేహన్ని వెలికి తీసి జహీరాబాద్ ప్రభుత్వ మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహన్ని కుటుంబీకులకు అప్పగించారు. ఈ మేరకు మృతుని తల్లి గాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కెమికల్ అనాలసిస్ కోసం ఎఫ్ఎస్ఎల్‌కు పంపనున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుని కుటుంబీకుల ఆరోపణ నేపథ్యంలో మృతునితో కలిసి బావి వద్దకు వెళ్లిన ఆ నలుగురు యువకుల్ని కస్టడీలోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు సమాచారం.

వన్యప్రాణులను వేటాడే యత్నం, 8 మంది అరెస్ట్

మూడు నాటు తుపాకులు లభ్యం

రిమాండ్‌కు నిందితుల తరలింపు



నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ మండల పరిధిలోని నత్నాయపల్లి గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో నాటు తుపాకులతో వన్యప్రాణులను వేటాడేందుకు తిరుగుతున్న 8 మంది ముఠా సభ్యులను పట్టుకొని అరెస్టు చేసినట్లు ఫారెస్ట్ రేంజ్ అధికారి అరవింద్ తెలిపారు. శనివారం నర్సాపూర్ ఫారెస్ట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. నిందితులందరూ బొంతపల్లి, షేర్ ఖాన్ పల్లి, నత్నయపల్లి గ్రామాలకు చెందినవారన్నారు. వీరి నుంచి మూడు నాటు తుపాకులు, ఒక కత్తి, గన్ పౌడర్ స్వాధీనపరచుకోవడం జరిగిందన్నారు. అదుపులోకి తీసుకున్న నిందితులు బొంతపల్లి గ్రామానికి చెందిన యాసీన్, నత్నయపల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్, బొంతపల్లి గ్రామానికి చెందిన కృష్ణ, శంకర్, వీరస్వామి, షేర్ ఖాన్ పల్లి గ్రామానికి చెందిన పోచయ్య, నత్నయపల్లి గ్రామానికి చెందిన విజయ్, భాను ప్రసాద్‌లుగా గుర్తించడం జరిగిందన్నారు వీరిని అరెస్టు చేసి నర్సాపూర్ కోర్టుకు రిమాండ్‌కు తరలించామని తెలిపారు. ఎవరైనా వన్యప్రాణులను చంపాలని చూస్తే వన్యప్రాణుల చట్టం ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ సెక్షన్ ఆఫీసర్ సాయిరాం, గోపాల్ రెడ్డి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

5వ రోజుకు ఎమ్మార్పీఎస్ రిలే నిరసన దీక్షలు



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ రిలే నిరసన దీక్షలు 5వ రోజుకు చేరాయి.శనివారం ఎంఎస్పి సీనియర్ నాయకులు సాదాకుల కృష్ణ మాదిగ అధ్యక్షతన నిర్వహించిన దీక్షలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు మైసగళ్ళ బుచ్చేంద్ర మాదిగ మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం.. ఇచ్చిన ప్రతీ నోటిఫికేషన్‌లో వర్గీకరణ అమలు చేసి మాదిగ జాతికి న్యాయం చేస్తానని నిండు శాసన సభలో సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చి.. నేడు విస్మరిస్తున్నారని మండిపడ్డారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాలలో ఎస్సీ వర్గీకరణ కు చట్టబద్ధత కల్పించి ప్రతీ ఉద్యోగంలో మాదిగలకు రిజర్వేషన్ల వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మాదిగల ఆగ్రాహనికి కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెద్ద గీత మాదిగ, గంధ గల వీరయ్య,బూడిద నవాజ్, సీనియర్ నాయకులు,గంగేరి శ్రీనివాస్, కాశీపురం ఆంజనేయులు, ప్రవీణ్, కోలుకుందా మోహన్ తదితరులు పాల్గొన్నారు.

జగదీష్‌రెడ్డి సస్పెన్షన్ హేయనీయం



నవతెలంగాణ-జహీరాబాద్

మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు జగదీశ్‌రెడ్డిని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ స్థానిక నాయకులు ఆర్టీసీ బస్టాండ్ వద్ద శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పేరుకేమో ప్రజాపాలన అని గొప్పలు చెబుతూ.. ఆరు గ్యారంటీలు ఇస్తామని ఇవ్వకుండా ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ప్రజల తరఫున మాట్లాడే తమ పార్టీ శాసన సభ్యుల గొంతు నొక్కడం ఏమిటని ప్రశ్నించారు. బడ్జెట్ సమావేశాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభలో ఉంటే తమ ఆటలు సాగవని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎమ్మెల్యేల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నదని ఆరో పించారు. వెంటనే ఈ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జహీరాబాద్ మండలాధ్యక్షులు తట్టు నారాయణ, ఝరాసంఘం మండలాధ్యక్షులు వెంకటేశం, కోహీర్ మండలాధ్యక్షులు నర్సింలు, మొగుడంపల్లి మండలాధ్యక్షులు సంజీవ్ రెడ్డి, సీనియర్ నాయకులు నామ రవికిరణ్, న్యాల్కల్ మండల మాజీ జెడ్పీటీసీ సభ్యులు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



కృత్రిమ మేధాతో విద్యార్థుల సామర్థ్యాలు మెరుగు



- జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు
- ముత్తంగి ప్రాథమిక పాఠశాలలో కృత్రిమ మేధా ఆధారిత బోధన అభ్యసనను ప్రారంభించిన కలెక్టర్

నవతెలంగాణ-పటాన్‌చెరు

బోధనలో కృత్రిమ మేధా వినియోగం వల్ల విద్యార్థుల సామర్థ్యాలు మెరుగుపడతాయని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. మండలంలోని ముత్తంగి గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కృత్రిమ మేధా ఆధారిత బోధనా అభ్యసన ప్రక్రియను శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. అభ్యసన ప్రక్రియలో కృత్రిమ మేధాను వినియోగించడం వల్ల బోధన సులువు అవుతుం దని.. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపడతాయన్నారు. బోధన అభ్యసన ప్రక్రియలో నూతన పద్ధతుల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా ముత్తంగి ప్రాథమిక పాఠశాలలో కృత్రిమ మేధా ఆధారిత బోధన అభ్యసన ప్రక్రియలను ప్రారంభించినట్లు తెలి పారు. జిల్లాలో 33 పాఠశాలల్లో శనివారం నుంచి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు అందరితో సమా నంగా చదువుకునే సామర్థ్యాన్ని అందించే విధంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈ పథకం అమలు చేయనున్న అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఇంటర్నెట్ సౌకర్యం, హెడ్సెట్లు అందించడం జరిగిందన్నారు. ఈ పథకం విజయవంతంగా కొనసాగడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో కలెక్టర్ పాల్గొని.. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల సౌకర్యాలపై సమీక్షించారు. తల్లిదండ్రులను పూర్తిస్థాయిలో పాఠశాల అభివృద్ధిలో విద్యార్థుల అభివృద్ధిలో భాగస్వాములు అయ్యేలా చూడాలన్నారు. పాఠశాలలో విద్యార్థులకు అందజేస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, ఉచిత యూనిఫారం, మధ్యాహ్న భోజనం, కంప్యూటర్ విద్య, ఇంటరాక్టివ్ ప్లాంట్ ప్యానెల్స్ ద్వారా విద్య, బాలికలకు ఆత్మరక్షణకు కరాటి లాంటి విద్యలు, పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం పూట స్నాక్స్ అందజేయడం తదితర సౌకర్యాలు గురించి కలెక్టర్ విద్యార్థులు తల్లిదండ్రులకు వివరించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకొని తమ పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని మరింత ఉన్నత స్థాయికి ఎదిగేలా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి ఎస్ వెంకటేశ్వర్లు, అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఎమ్ అనురాధ, సీఎంవో కే వెంకటేశం, మండల విద్యాధికారి నాగేశ్వర్ నాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారదమ్మ, ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షులు, సభ్యులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమస్యలు పక్కకు పెట్టి లక్ష్యంపైనే గురి పెట్టండి

-జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి



నవతెలంగాణ-కొమురవెల్లి

సమస్యలను పక్కన పెట్టి అనుకున్న లక్ష్యం పైనే గురిపెట్టాలని జిల్లా కలెక్టర్ మిక్కిలేని మనుచౌదరి విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. శనివారం మండలంలోని గురువన్నపేట పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్(ఫౌండేషన్ లిటరసీ న్యూమరసి) ప్రోగ్రాం ద్వార విద్యార్థుల సామర్థ్యాని పెంపోదించేందుకు డీఈవో శ్రీనివాస్ రెడ్డితో కలసి 'ఏఐ(అర్టిఫిషియల్ ఇంటలిజెన్సు) కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఏఐ ద్వార విద్యాబోధన చేసేందకు 31 పాఠశాలలు ఎంపిక చేశామని ప్రస్తుతం 29 పాఠశాలలో ప్రారభించామని తెలిపారు. జిల్లాలోరూ. 30 కోట్లతో అమ్మ ఆదర్శ కమిటీల ద్వార టాయిలెట్స్, అదనపు తరగతి గదులు, ప్రహరి గోడల నిర్మాణం, తదితర నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. విద్యార్థులు ప్రతి రోజు వార్త పత్రికలు చదువే అలవాటు చేసుకోవాలని సూచించారు. పాఠశాలకు వార్త పత్రికలు అందుబాటులోలేవని విద్యార్థులు తెలుపడంతో పలు వార్త పత్రికలు తెప్పించుకోవాలని .అందుకు సంబంధించిని బిల్లు తాను చెల్లిస్తానంటూ పాఠశాల ప్రధానోపాధ్యాలు రాజుకు సూచించారు. విద్యార్థులు ఇష్టమైన రంగాల్లో కష్టపడితే మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. విద్యార్థులకు స్టేజీ ఫియర్ లేకుండా ప్రతి రోజు ఒక్క విద్యార్థితో ఎదో ఒక విషయంపై మాట్లాడించాలని, పాఠశాలలో నేర్పిన విలువలు జీవితాంతం పాటిస్తారని, విద్యార్థులకు మంచి విలువలను భోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలకు కావల్సిన మౌళిక వసతులు పాఠశాల ప్రహరీగోడ, 5 కంప్యూటర్లు వెంటనే మంజూరి చేస్తానని వచ్చే విద్యాసంవత్సరంలో విద్యార్థుల సంఖ్య పెరిగితే పాఠశాలకు బస్సు, అదనపు తరగతి గదులు, సైన్సల్యాబ్ , ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి రామస్వామి, ఎఎస్ఓ భాస్కర్, తహశీల్దార్ దివ్య, ఎంపీడీవో శ్రీనివాస వర్మ, ఎంఈవో రమేష్, ఎస్ఐ రాజు, పాఠశాల ప్రధానోపా ధ్యాయులు బి.రాజు, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్లు బాలమణి, స్వప్నలు పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి

- 73 షెడ్యూల్ పరిశ్రమలు కనీస వేతనాల జీవోలను పెరిగిన ధరలకు అనుగుణంగా సవరించాలి
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి. సాయిలు

నవతెలంగాణ-సంగారెడ్డి

కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని.. 73 షెడ్యూల్ పరిశ్రమలు కనీస వేతనాల జీవోలను పెరిగిన ధరలకు అనుగుణంగా సవరించాలనిసీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవన్లో సంగారెడ్డి సీఐటీయూ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ.. కార్మిక వర్గంపై బీజేపీ పదేండ్లుగా యుద్ధం చేస్తున్నాదన్నారు. కనీస వేతనం అక్రా యుడు కమిటీ తీర్మానం ప్రకారం రూ.26,000 చెల్లిస్తే తప్పా.. సగటు కార్మికుడు బతకలేడన్నారు. ఎన్నిసార్లు కేంద్ర ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా వేతనాలు పెంచలేదన్నారు. కానీ ఫ్లోర్ లెవెల్ మినిమం వేజ్ రోజుకు రూ.178గా బీజేపీ నిర్ణయించడం దారుణమన్నారు. కార్పొరేట్ల ప్రయో జనాల కోసం 29 కార్మిక చట్టాలను సవరించి, నాలుగు లేబర్ కోడ్ లుగా తెచ్చిందన్నారు. ఈ కోడ్‌ల వల్ల కార్మికులు సంఘాలు పెట్టుకునే హక్కు కోల్పోతారన్నారు. సమ్మె హక్కు కాల రాయబడిందని, 8 గంటల పని 12 గంటలకు మార్చారన్నారు. కోట్లాది మంది అసంఘటిత రంగ కార్మికులకు వర్తించే ఈపీఎఫ్ పెన్షన్ నెలకు పదివేలు పెంచాలని బీజేపీకి మనసొప్పడం లేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు కొత్త పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ పునరుద్ధరించడానికి అంగీకరించడం లేదన్నారు. స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించడం లేదన్నారు. 2022 విద్యుత్ సవర ణ చట్టాన్ని తెచ్చి ప్రభుత్వం తన బాధ్యత నుండి తప్పుకొని కార్పొరేట్ విద్యుత్ కంపెనీలకు వేల కోట్ల లాభాలు కట్టబెట్టేందుకు తెగబడిందని మండిపడ్డారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు బాటలు వేసిం దన్నారు. 100 రోజుల్లో ధరలు తగ్గిస్తానని, పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్, నిత్యవసర వస్తువుల చార్జీలు విపరీతంగా పెంచారన్నారు. నల్లధనాన్ని వెనక్కి తెచ్చి పేదల బ్యాంక్ అకౌంట్లో 15 లక్షలు డిపాజిట్ చేస్తానన్న వాగ్దానం మర్చిపోయిందన్నారు. హిందూ- ముస్లింలు ఘర్షణలు పెంచుతున్నదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.యాదగిరి జిల్లా ఉపాధ్యక్షులు వి.ప్రవీణ్ నాయకులు, బాబురావు,రాజు,మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



మహిళల అక్రమ రవాణా అరికట్టడంలో గ్రామసంఘాల బాధ్యత ఎనలేనిది

నవతెలంగాణ-ఝరాసంగం



మహిళలు, చిన్నపిల్లల అక్రమ రవాణాను అరికట్టడంలో గ్రామ సంఘాల బాధ్యత ఎంతో ఉందని పేదరిక నిర్మూలన సంస్థ సహాయక ప్రాజెక్టు మేనేజర్ టిక్యా నాయక్ అన్నారు. ఝరాసంగం మండల కేంద్రంలోని పేదరిక నిర్మూలన సంస్థ కార్యాలయంలో వీవోఏలు మరియు వివో ఓబిలకు మహిళ అక్రమ రవాణాపై ఒకరోజు శిక్షణా కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి ఆధునిక యుగంలో ప్రతి ఒక్కరి దగ్గర ఆండ్రాయిడ్ ఫోన్లు ఉండడం సాధారణ మైందన్నారు. వీటి ద్వారా అనేక సైబర్ నేరాలు మనకు తెలియకుండానే జరుగుతున్నాయని వీటిపై ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు. తెలియని నంబర్లనుండి ఫోన్ కాల్స్ వచ్చిన బెనిఫిట్ మెసేజ్‌లు వచ్చినా రెస్పాండ్ కావొద్దన్నారు. పరిచయం లేని వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలన్నారు. మాజీ ఐఏఎస్ అధికారిని సునీత కృష్ణన్ ప్రజ్వల్ అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించి అక్రమ రవాణాకు గురైన మహిళలను చిన్నపిల్లలను గుర్తించి వివిధ ఏజెన్సీల ద్వారా వారిని కలుసుకొని తన సంస్థలో చేర్చుకొని వారి యోగక్షేమాలు చూస్తున్నారని ఏబీఎస్ తెలిపారు. మన వంతుగా మహిళలు, చిన్నపిల్లలు, వృద్ధులు అక్రమ రవాణాకు గురికాకుండా తమ వంతు కృషి చేయాలన్నారు. చిన్నపిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఇన్చార్జి ఎస్.ఐ కే.సంగమేశ్వర్ టీటీటి మారుతి సీసీలు మల్లేశం గోపాల్ శ్రీనివాస్ రెడ్డి నర్సమ్మ మహిళా సంఘాల సభ్యులు వివోఏలు పాల్గొన్నారు.

భార్యను చంపిన కేసులో భర్త అరెస్ట్

- టెక్నాలజీ ఉపయోగించి కేసును చేదించిన టూ టౌన్ పోలీసులు



నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యను చంపిన కేసులో భర్తను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిద్దిపేట ఏసీపీ మధు తెలిపారు. శనివారం సిద్దిపేట ఏసీపీ ఆఫీసులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీహార్ రాష్ట్రం తల్వార్ బంధ గ్రామానికి చెందిన బోలరాం హరిజన్ అదే రాష్ట్రానికి చెందిన మైనర్ బాలికను ప్రేమ వివాహం చేసుకొని ఆమె తల్లిదండ్రులకు తెలియకుండా బీహార్ రాష్ట్రం నుంచి సిద్దిపేటకు తీసుకు వచ్చి, దక్కుల కాలనిలో మేర సంఘం భవనం సమీపంలో ఒక రూము కిరాయికి తీసుకొని అందులో కాపురం పెట్టి, పెయింటర్‌గా పనిచేస్తూ ఉండేవాడు. కాగా అతనికి మద్యంతో పాటు ఇతర చెడు అలవాట్లు ఉండడంతో, రోజు తాగి వచ్చి ప్రతినిత్యం భార్యని కొట్టేవాడని, ఈ క్రమంలో ఎప్పటిలాగే ఫిబ్రవరి 14వ తేదీ రాత్రి బాగా తాగి వచ్చి తన భార్యతో రోజులాగే గొడవ పడి కోపంలో ఆమె తలను గోడకేసి గుద్ది, గొంతు పిసికి చంపి, శవంను ఏమీ చేయాలో తెలియక అక్కడే ఉన్న మేర సంఘం భవనం సంపులో పడేసి మూత పెట్టి, సిద్దిపేట నుంచి బీహార్ రాష్ట్రానికి పారిపోయాడని ఏసీపీ తెలిపారు. మేర సంఘము అధ్యక్షుడు గంగాపురం కృష్ణ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు కోసం గాలిస్తుండగా, శనివారం హరిజన్ సిద్దిపేట రూమ్‌లో ఉన్న తన సామాన్లు తీసుకు వెళ్లేందుకు సిద్దిపేటకు రాగా సిద్దిపేట టూ టౌన్ సీఐ బి.ఉపేందర్, ఏఎస్ఐ యాసిన్ మియా, సిబ్బంది యాదగిరి, సుధాకర్ రెడ్డి, కనకరాజు, ప్రశాంత్ లతో కలిసి నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారించగా తన భార్యను చంపిన నేరాన్ని ఒప్పుకోవడంతో అతన్ని అరెస్టు చేసి జ్యుడిషియల్ డిమాండ్ కు పంపినట్లు తెలిపారు.

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు పెండింగ్ జీతాలు చెల్లించాలి

- కనీస వేతనం రూ.26000/-లుగా పెంచాలి
- ఉద్యోగ భద్రత కల్పించాలి
- కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మానిక్

నవతెలంగాణ-సంగారెడ్డి

సాంఘిక సంక్షేమ హాస్టల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు చెల్లించాల్సిన 9 నెలల పెండింగ్ జీతాలు ఇవ్వాలని, కనీస వేతనాలు అమలు చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మానిక్ డిమాండ్ చేశారు. కుల వ్యవక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఏవో పరమేశ్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అతిమేల మాణిక్ మాట్లాడుతూ పెరిగిన ధరలకనుగుణంగా కనీస వేతనం రూ.26,000/-లకు పెంచాలన్నారు. జిల్లాలో సాంఘిక సంక్షేమ హాస్టల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులకు గత తొమ్మిది నెలలుగా జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. జిల్లాలో 86 మంది కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ పద్ధతిలో గత 10 సంవత్సరాలుగా వాచ్‌మెన్, కామెటీలు, వంట మనుషులుగా పనిచేస్తున్నారన్నారు. కాలేజ్ హాస్టల్‌లో పనిచేస్తున్న కార్మికులకు చట్టపరమైన కనీస వేతనాలు, పిఎఫ్, ఈఎస్ఐ వంటివి అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తీవ్రంగా శ్రమదోపిడికి కార్మికులు గురవుతున్నారన్నారు. కాలేజ్ హాస్టల్‌లో పనిచేస్తున్న కార్మికులకు నెలకు రూ. 9300/- ఇస్తామని చెప్పి తీసుకొని కేవలం రూ.7000/- మాత్రమే ఇస్తున్నారన్నారు. ఔట్సోర్సింగ్ కార్మికులకు రూ.19300/- ఇవ్వాల్సి ఉండగా, రూ.13400/- ఇస్తున్నారన్నారు. పిఎఫ్ రూ.2350/-కటింగ్ చేస్తునారన్నారు. ఇంకా అదనంగా రూ.3550/- జీతాల నుంచి కట్ చేస్తున్నారన్నారు. వస్తున్న చాలీచాలని జీతాలని, అవి కూడా 9 నెలలుగా రాకపోవడంతో కార్మికుల కుటుంబాలు గడవలేని పరిస్థితి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పెద్దపురం అశోక్, జిల్లా ఉపాధ్యక్షులు మద్దూరి శివకుమార్, జిల్లా సహాయ కార్యదర్శి బి ప్రవీణ్, నాయకులు శ్రీనివాస్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల జయంతుల కోసం సన్నాహక సమావేశం నిర్వహించాలి

మహనీయుల జయంతులను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు సామాజిక ప్రజాసంఘాలతో సన్నాహక సమావేశం వెంటనే నిర్వహించాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మానిక్ కోరారు. ఈ మేరకు శనివారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏవో పరమేష్‌కి వినతి పత్రం అందజేశారు. అనంతరం మాణిక్ మాట్లాడుతూ.. ఏప్రిల్ నెల అంటేనే మహనీయుల మాసమని ఏప్రిల్ 5 బాబు జగ్జీవన్ రామ్ జయంతి, ఏప్రిల్ 11 మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి, ఏప్రిల్ 14 రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతులు ఉంటాయన్నారు. ప్రభుత్వం తరఫున అధికారికంగా మహనీయుల జయంతులను ఘనంగా నిర్వహించాలని.. అందుకోసం ఈ నెలలోనే అధికారులతో సామాజిక ప్రజాసంఘాలతో సన్నాహక సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.అశోక్ జిల్లా ఉపాధ్యక్షులు మద్దూరు శివకుమార్, జిల్లా సహాయ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, నాయకులు శ్రీనివాస్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



యూనియన్ బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-జహీరాబాద్



యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవలను ప్రజలు మరింతగా వినియోగించుకోవాలని సిద్దిపేట రీజినల్ హెడ్ ఎడ వికాస్ సూచించారు. మొగుడంపల్లి మండల కేంద్రంలో డిపాజిట్-విత్‌డ్రా ఏటీఎం మిషన్‌ను శనివారం ప్రారంభించారు. బ్యాంకు సేవలను విస్తరించడంలో భాగంగా, ఈ కొత్త ఏటీఎం మిషన్ ప్రజలకు డిపాజిట్, విత్‌డ్రా సౌకర్యాలను అందించనుంది. ఖాతాదారులు బ్యాంక్ సేవల్లో కొన్ని సమస్యలను ప్రస్తా వించారు. బ్యాంక్‌లో కరెంట్ సమస్యలు లేకుండా చూడాలని, గోల్డ్ లోన్ సదుపాయాన్ని అందించాలని కోరారు. అలాగే, క్రాఫ్ట్ లోన్ వడ్డీ చెల్లింపునకు బ్రోకర్లను ఆశ్రయించకుండా, వడ్డీతోనే రిన్యువల్ చేసే అవకాశం కల్పించాలని కోరారు. ఖాతాదారుల సమస్యలపై స్పందించిన ఎడ వికాస్, వీటిని త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలు బ్యాంక్ ద్వారా అందించబడుతున్న సేవలను సమర్థవంతంగా వినియో గించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ బ్యాంక్ మేనే జర్ ముఖేష్, చీఫ్ మేనేజర్ సంజయ్ చౌదరి, డిప్యూటీ బ్రాంచ్ మేనేజర్ జె. ప్రవాస్ కుమార్, దత్తాత్రేయ ఆర్డీవో, జె.రమేష్ రాంజోల్ బ్రాంచ్ మేనేజర్, హెడ్ క్యాషియర్ శ్రీనివాస్ రెడ్డి, కిష్టయ్య, గ్రామ పెద్దలు చించోలి కర్ ప్రేమ్ కుమార్, ఎండి.కుత్బుద్దీన్, యువ నాయకులు సుభాష్, సందీప్, షేకాపురం రాజు తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ ఆంథోనీస్‌లో విద్యార్థుల వీడ్కోలు సమావేశం

నవతెలంగాణ-సంగారెడ్డి



సంగారెడ్డి పట్టణంలోని శాంతినగర్‌లో గల సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులు ప్రొఫెసర్ ప్రిన్సిపాల్ సెయింట్ పాల్స్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ డా కిరణ్మయి మాందవ, సెయింట్ ఆంథోనీస్ విద్యా సంస్థల అధినేత ఈ.సాల్మోన్ రెడ్డి, పాఠశాల డైరెక్టర్ ఈ.విజయ్ కుమార్ రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్, ప్రధానోపాధ్యాయరాలు ఈ.అరుణా రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ హెడ్ ఈ.జయబాలరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ .యల్.ప్రదీప్ కుమార్, సెయింట్ ఆంథోనీస్ మహిళా డిగ్రీ కళాశాల అకాడ మిక్ కౌన్సిలర్ యస్.కృష్ణకుమారిలు జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. విద్యార్థుల స్వాగతం నృత్యం గీతంతో కార్యక్రమాలను ప్రారంభిం చారు. అనంతరం సాల్మోన్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు తమ శక్తి సామర్థ్యాలను ఎప్పటికప్పుడు పెంచుకోవాలన్నారు. మన వద్ద లేనివి, ఇతరుల వద్ద ఉన్నవి చూసి నేర్చుకోవాలన్నారు. వాటికి తోడు ఆత్మ స్థైర్యంతో ముంద డుగు వేయాలన్నారు. విద్యార్థులు తమ భావి జీవితంలో ఘనవిజయాన్ని సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం 9వ, 10వ తరగతి విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. తదనంతరం పాఠశాలను వదిలి వెళుతున్న విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం వారు చిరు జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెల్లాపూర్‌లో పోస్ట్‌ఆఫీస్‌ను ప్రారంభించిన ఎంపీ

నవతెలంగాణ-రామచంద్రాపురం



తెల్లాపూర్ మున్సిపాల్టీ పరిధిలో నూతన పోస్ట్ ఆఫీస్‌ను మెదక్ ఎంపీ రఘునందన్‌రావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానం మేరకు ఈ ప్రాంత వాసుల కోరిక ప్రకారం నేడు నూతన పోస్ట్ ఆఫీస్‌ను ప్రారంభించినట్టు చెప్పారు. పోస్ట్ ఆఫీస్‌లో ఉన్న వసతులను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. తెల్లాపూర్ అభివృద్ధికి ఎల్లప్పుడూ తనవంతు ప్రయత్నం చేస్తాన న్నారు. రైల్వే అండర్ బ్రిడ్జ్, సబ్ స్టేషన్, రైల్వే స్టేషన్‌కు దారి ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నానన్నారు. తెల్లాపూర్ పేరును తెలంగాణ పురంగా మార్చేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోస్టల్ శాఖ అధికారి మురళి కుమార్, కమిషనర్ సంగారెడ్డి, మాజీ కౌన్సిలర్ రాజు, పిఎసిఎస్ చైర్మన్ బుచ్చిరెడ్డి, తెల్లాపూర్ మున్సిపాలిటీ బిజెపి పార్టీ అధ్యక్షులు రాంబాబు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సంగారెడ్డి
2
ఆదివారం | 16 మార్చి 2025 | www.navatelangana.com

జగదీష్‌రెడ్డి సస్పెన్షన్ అప్రజాస్వామికం

నవతెలంగాణ-జహీరాబాద్



మాజీమంత్రి జగదీశ్ రెడ్డిని శాసనసభ నుంచి సస్పెండ్ చేయడం అప్రజాస్వామికమని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ వై.నరోత్తం అన్నారు. ఈ సందర్భంగా శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో అధికార, ప్రతిపక్ష సభ్యులను సమానంగా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిది అన్నారు. అధికార పక్షం తప్పిదాలను, ప్రజాసమస్యలపై ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డి అసెంబ్లీలో ప్రశ్నిస్తుంటే దాన్ని జీర్ణించుకోలేని అధికార పక్షం.. స్పీకర్‌ని కించపర్చారని అసెంబ్లీ సమావేశాల నుంచి బహిష్కరించడం హేయమైన చర్య అన్నారు. అసెంబ్లీ చరిత్రలో చీకటి రోజు అని దుయ్యబట్టారు. సభాపతిని అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేయడం దారుణమన్నారు. ప్రజా సమస్యలపై గొంతెత్తడం నేరమా అంటూ ప్రశ్నించారు. గతంలో 10ఏండ్లు ముఖ్యమంత్రిగా చేసిన కేసీఆర్‌ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇష్టానుసారంగా మాట్లాడటం అధికార పక్షం దూరహంకారానికి నిదర్శనమన్నారు. దమ్ముంటే ఇచ్చిన హామీలను అమలు చేసి మాట నిలబెట్టుకోవాలి.. అంతేకాని అప్రజాస్వామికంగా వ్యవహరిస్తే సహించేదిలేదన్నారు. వెంటనే జగదీష్ రెడ్డి సస్పెనన్‌ను ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు.



పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన చీఫ్ సూపరింటెండెంట్

నవతెలంగాణ-వట్‌పల్లి

మండలంలోని మర్వెల్లి ఉన్నత పాఠశాల పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని చీఫ్ సూపరింటెండెంట్ రంజిత్ కుమార్ డిపార్ట్మెంటల్ ఆఫీసర్ శ్రీదేవి సింగ్ రాథోడ్‌తో కలిసి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి పరీక్షా సెంటర్లలో అన్ని వసతులను కల్పించాలని ప్రధానోపాధ్యాయులు నాగిరెడ్డికి సూచించారు. పరీక్షలు రాసే విద్యార్థులకు ఎలాంటి లోటు పట్లు రాకుండా పరీక్ష గదుల్లో లైట్లు, ఫ్యాన్లు, తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. పాఠశాలకు తగిన సౌక ర్యాలను కల్పించాలన్నారు. ఆయన వెంట సి సెంటర్ పేపర్ కస్టోడియం చంద్ర ప్రకాష్, ప్రధానోపాధ్యాయులు నాగిరెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



అంతక్రియల్లో పాల్గొన్న డీసీసీ ప్రధాన కార్యదర్శి

నవతెలంగాణ-మనూర్

నాగలిగిద్దా మండలం దామర్ గిద్దా గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున్ తల్లి శనివారం మృతి చెందింది. ఆమె అంతక్రియల్లో డీసీసీ ప్రధాన కార్యదర్శి పి.చంద్రశేఖర్ రెడ్డి పాల్గొని నివాళ్లర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట మాజీ ఎంపీటీసీ పండ రినాథ్, నాయకులు శర్నప్ప, బస్వరాజ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మొగడంపల్లి జడ్పీ హైస్కూల్‌లో దుండగుల విధ్వంసం

నవతెలంగాణ-జహీరాబాద్



మొగడంపల్లి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గుర్తు తెలియని దుండగులు శుక్రవారం రాత్రివేళ ప్రవేశించి విధ్వంసం సృష్టించారు. పాఠశాలలోని ఫ్యాన్లు, కిటికీలు, ట్యూబ్ లైట్లు ధ్వంసం చేసి పరారయ్యారు. ఉదయం విషయం గుర్తించిన సిబ్బంది, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈ ఘటనపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రేజింతల్‌లో చలివేంద్రం ఏర్పాటు



నవతెలంగాణ-న్యాల్‌కల్

మండంలోని రేజింతల్ గ్రామంలో గల బస్టాండ్ ప్రధాన చౌరస్తా వద్ద ఊరడమ్మ గుడి ఆలయ కమిటీ సభ్యులు స్వచ్ఛందంగా చలి వేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని శనివారం రిబ్బన్‌కట్ చేసి స్థానికులు, కమిటీ సభ్యులు ప్రారంభించారు. వేసవిలో బాటసారుల దాహాన్ని తీర్చడానికి ఈ చలివేంద్రం ఎంతో ఉపయోగప డుంతు ందన్నారు. చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన ఆలయ కమిటీ సభ్యులను స్థానికులు అబినందించారు. ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడానికి యువత ముందుండాలన్నారు.

వీరభద్ర స్వామి దేవాలయం హుండీ లెక్కింపు

నవతెలంగాణ-గుమ్మడిదల



మండలంలోని బొంతపల్లి వీరన్న గూడెం భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయంలో శనివారం హుండీ లెక్కింపు చేపట్టారు. ఆలయ ధర్మ కర్తల మండలి చైర్మెన్ మద్ది ప్రతాప్‌రెడ్డి, దేవాదాయ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, ఆలయ కార్య నిర్వహణ అధికారి పి.శశిధర్ గుప్తా సమక్షంలో మూడు నెలల హుండీ లెక్కింపు కార్యక్రమం శివ కేశవ స్వచ్ఛంద సేవా సంస్థ వారిచే నిర్వహించారు.కాగా హుండీ ఆదాయం రూ.13,83,135, అన్నదాన సత్రం హుండీ ఆదాయం రూ.57,447 వచ్చినట్లు వారు తెలిపారు.కార్యక్రమంలో ధర్మకర్తలు, గ్రామ పెద్దలు, దేవస్థానం సిబ్బంది అర్చకులు పాల్గొన్నారు.



ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

నవతెలంగాణ-చౌటకూర్

మండల పరిధిలోని ఏటిగడ్డ లింగంపల్లి గ్రామంలో బేగరి పోచయ్య ఇంటి దగ్గర విద్యుత్ స్తంభం నుంచి తీగలు కిందకు వేలాడుతున్నాయి. ఈ విషయాన్ని మండల ఏఈ, లైన్‌మెన్లకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని.. వెంటనే ఆ వైర్లను సరిచేయాలని కోరుతూ సీపీఐ(ఎం)ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏవోకు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జి ల్లా కార్య దర్శి వర్గ సభ్యులు అతిమెల మాణిక్ మాట్లాడుతూ..ఆ వైర్లు ఎప్పుడు జారిపడ తా యె రా.. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని భయం గుప్పిట్లో కాలం వెళ్లదీ స్తుంన్నారన్నారు. కొత్తస్తంభాలు వేసి కరెంట్ వైర్లను వెంటనే మార్చాలని విజ్ఞప్తి చేశారు.

చేపలు పట్టేందుకు వెళ్లి యువకుడు మృతి



నవతెలంగాణ-మునిపల్లి

చేపలు పట్టేందుకు వెళ్లి విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి చెందిన సంఘటన తక్కడపల్లి గ్రామ శివారులో శనివారం జరిగింది. ఎస్సై రాజేష్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిన్నచిల్మెడ గ్రామానికి చెందిన దూదేకుల అమీరుద్దీన్(30), మునిపల్లి మండలం తక్కడపల్లి గ్రామానికి చెందిన సద్దాం అహ్మద్‌లు తక్కడపల్లి గ్రామ శివారో గల సింగూర్ బ్యాక్ వాటర్ లో కరెంటు వైర్లతో చేపలు పట్టడానికి వెళ్లారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్ తగిలి అమీరుద్దీన్ మృతి చెందాడు. మృతుని సోదరుడు దూదేకుల బషిరోద్దీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చెప్పారు.

రంజాన్ ప్రత్యేకం..
హలీం



- కళకళలాడుతున్న బజార్లు
- కోళ్లకు రోగాలు వస్తున్న నేపథ్యంలో

గతేడాదికంటే తగ్గిన దుకాణాలు

నవతెలంగాణ-జహీరాబాద్

రంజాన్ వచ్చిందంటే చాలు ప్రతి ఒక్కరి నోరు ఊరించే వంటకం హలీం, హరీస్, దయివడాలు. రోడ్ల పక్కన ప్రత్యేక గుడారాలు, హెూటళ్లలో తయారయ్యే ఈ ప్రత్యేక వంటకాలకు ప్రజల నుంచి కూడా స్పందన వస్తోంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌ను తలపించేలా జహీరాబాద్‌లో దుకాణాలు వెలిశాయి. ఇక్కడ నుంచి ఇతర ప్రాంతాలకు సైతం ఎగుమతులు చేస్తున్నారు.

హైదరాబాద్‌ను తలపించేలా జహీరాబాద్‌లో హలీం, హరీస్ దుకాణాలు వెలిశాయి. పండగకు వారం రోజుల ముందే దుకాణ యజమానులు ప్రత్యేక పొయ్యిలతో పాటు వంట సామ గ్రిని కూడా సమకూర్చారు. కాగా రంజాన్ మాసంలో ప్రత్యేక మైన వంటకాలతో పాటు పిండి వంటకాలకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తారు. ప్రధానంగా హరీస్ తయారీలో మాంసంతో పాటు సుగంధ ద్రవ్యాలైన దాల్చిన చెక్కలు, కాజు, బాదం, ఖర్బుజా, తర్బుజా, అక్రోట్ విత్తనాలతో పాటు గోదుమ రవ్వ, నెయ్యి, ఇలాయిచిలు, మిరియాలు, లవంగాలను వాడడంతో.. ఆ వంటకం చేస్తున్నప్పుడు చుట్టు పక్కల ప్రాంతం సైతం సువాసనతో ఘుమఘుమ లాడుతుంది. కాగా ఈ వంటకం తింటే.. శరీరానికి వెంటనే శక్తి లభిస్తుంది. కాబట్టి రంజాన్ ఉపవాసాలు విడిచిన వేంటనే చాల మంది ఈ హరీస్, హలీంను తినడానికి ఇష్టపడుతారు.

జహీరాబాద్ నుంచి ఎగుమతి..

జహీరాబాద్ నుంచి ఈ హరీస్, హలీంలను కర్ణాటక, మహరాష్ట్రలకు ఎగుమతులు చేస్తారు. జహీరాబాద్ నుంచి ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసి అందులో తరలిస్తారు.

నిరుపేదలకు అందుబాటులో ధరలు..

నేడు మటన్ కొనేందుకు వెళ్లితే కిలో రూ.600 పలుకుతుంది. కానీ హరీస్‌ను మాత్రం కేవలం రూ.100 నుంచి 150, 250కి విక్రయిస్తారు. సామన్య ప్రజలు కూడా హరీస్‌ను కొనుగోలు చేసేలా ధరలు తక్కువగా ఉంటాయి.

హరీస్, హలీంలో ఎన్నోరకాలు

మారుతున్న జీవనశైలికి తగ్గట్టుగా నేడు శుగర్ ఫ్రీ హరీస్ కుడా తయారు చేస్తున్నారు. చికెన్, వెజిటేబుల్ హరీస్‌లు కూడా అందుబాటులో ఉంటున్నాయి. అయితే వాటి ధర కొంచెం ఎక్కువ ఉన్నందున ప్రజలు తక్కువగా కొనుగోలు చేస్తున్నారు. జహీరాబాద్‌లో సుమారు 10 హరీస్ దుకాణాలు వెలిశాయి.

పారిశుధ్యం.. అలంకరణ ముఖ్యం

హరీస్ దుకాణాలను రకరకాల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రతీ రోజు పూలతో అలంకరించి వినియోగదారులను ఆకర్శించేందకు ప్రయత్నం చేస్తునాన్నరు. దుకాణాల వద్ద అన్ని విదాల పారిశుధ్య కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యత ఇస్తారు.

నిరుపేదలకు దయివడలే హరీస్..

నిరుపేదలు హరీస్ కొనేందుకు సామర్థ్యం లేని వారు పెరుగు, పిండితో తయారు చేసిన దయివడలతోనే సరి పెట్టుకుంటారు. వాటి దర కేవలం ప్లేటుకు రూ.20 నుంచి రూ.30 మాత్రమే ఉంటుంది. కాబట్టి నిరుపేదలు ఎక్కువగా కొనుగోలు చేస్తారు. దయివడలు ఒక పొద్దు విడిచిన అనంతరం తింటే కడుపులో ఏ విధమైన ఇబ్బందులు రావని వైద్యులు కూడా సూచిస్తున్నారు.

రోగాలతో కోళ్ల మృత్యువాత.. తగ్గిన గిరాకి

ఈయేడు ఇటీవలే బర్డ్ ఫ్లూతో ఇతర రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున కోళ్ల మృత్యువాత పడ్డాయి. మన రాష్ట్రంలోనూ చాలా చోట్ల కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకినట్టు వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ప్రజలు చికెన్ తినడం పెద్ద ఎత్తున తగ్గించారు. ఆ ప్రభావం హలీం, హరీస్ దుకాణాలపై కూడా పడింది. దాంతో గతేడాదితో పోలిస్తే ఈసారి గిరాకి తగ్గింది.

నిర్లక్ష్యం వహించిన మున్సిపల్ సిబ్బందికి షోకాజ్ నోటీసులు

నవతెలంగాణ-సంగారెడ్డి



మున్సిపాల్టీలకు సంబంధించిన ఇంటి పన్నులు, ప్రాపర్టీ టాక్స్, కుళాయి బిల్లుల వసూల్లో నిర్లక్ష్యం వహించిన సంగారెడ్డి, సదాశివపేట, జహీరాబాద్ మునిసిపల్ కమిషనర్లు, మేనేజర్లు, బిల్ కలెక్టర్లకు జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు షోకాజ్ నోటీసులను శనివారం జారీ చేశారు. ఈ నెలాఖరులోగా 100 శాతం ఇంటి పన్నులు, కుళాయి బిల్లులు వసూలు చేయాలని టార్గెట్ విధించగా మూడు మున్సిపాల్టీల్లో బిల్లుల వసూలు పట్ల సిబ్బంది నిర్లక్ష్యం వహించడం పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వారం రోజుల క్రితం కొంతమంది మున్సిపల్ బిల్ కలెక్టర్లు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు మేనేజర్లకు సస్పెన్షన్, షోకాజ్ నోటీసులు జారీ చేసినప్పటికీ సిబ్బంది పనితీరులో మార్పు రాకపోవడంతో.. జహీరాబాద్ మున్సిపాల్టీలో కమిషనర్ ఉమామహేశ్వరరావు, మేనే జర్ ఉమేశ్వర్ లాల్, బిల్ కలెక్టర్లు 8 మందికి షోకాస్ నోటీసులు జారీ చేశారు. సంగారెడ్డి మున్సిపాల్టీలో మున్సిపల్ కమిషనర్ ఎస్పీ వీకే ఛావన్, మేనేజర్ సూర్య ప్రకాష్ ,బిల్ కలెక్టర్లు 27 మందికి షోకాజు నోటీసులు జారీ చేశారు. సదాశివపేట మున్సిపాల్టీలో కమిషనర్ జే.ఉమా, మేనేజర్ ఉమర్ సింగ్, 14 మంది బిల్ కలెక్టర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇంటి పన్నులు, కుళాయి బిల్లును, ప్రాపర్టీ టాక్స్ 100శాతం వసూలు చేయాలని ఆదేశించారు. షోకా జ్ నోటీసులకు 24 గంటల్లో సమాధానం ఇవ్వాలని లేకుంటే కఠిన శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు నోటీసుల్లో పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం నాణ్యతతో జరగాలి

నవతెలంగాణ-పటాన్‌చెరు



ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు నాణ్యతతో వేగవంతంగా జరిగేలా చూడాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అధికారులను ఆదేశించారు. పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను శనివారం ఆమె పరిశీలించారు. ఈ గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా శిక్షణ పొందిన మహిళా మేస్త్రీలు ఇండ్ల నిర్మాణంలో భాగస్వాములయ్యేలా అధికా రులు చర్యలు చేపట్టాలన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన సిమెంట్ ఇటుకలను ఇండ్ల నిర్మాణంలో వినియోగించుకోవాలన్నారు. దాంతో తక్కువ ధరకు నాణ్యమైన ఇటుకలు లబ్దిదారులకు లభిస్తాయన్నారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడి ఇండ్ల నిర్మా ణాల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులు నిర్మాణం పనులను పరిశీలిస్తూ నిర్మాణం పనులు నాణ్యత జరిగేలా చూడాలని ఈ సందర్భంగా లబ్ధిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గృహ నిర్మాణ సంస్థ, పీడీ చలపతి రావు, తహసీల్దార్ రంగారావు, ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ చెల్లించండి.. 25శాతం రాయితీ పొందండి

నవతెలంగాణ-చౌటకూర్



ఈనెల 31లోపు ఎల్‌ఆర్‌ఎస్‌ను చెల్లిస్తే 25శాతం రాయితీ వర్తిస్తుందని.. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ పాండు సూచించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం, మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని శనివారం సంద ర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతూ.. మండలంలో మొత్తం ఎల్‌ఆర్‌ఎస్ అప్లికేషన్ ఎన్ని ఉన్నాయో అడగ్గా.. ఎంపీడీవో శంకర్ స్పందిస్తూ మండలంలో 78 ఉండగా అందులో ఇప్పటి వరకు 13 మంది ఎల్‌ఆర్‌ఎస్ అమౌంట్ చెల్లించినట్టు తెలిపారు. ఎల్‌ఆర్ఎస్ చెల్లించే అభ్యర్థులను పిలిపించి వారికి అవగాహన కల్పించారు. అభ్యర్థులకు ఏమైనా సందేహం ఉంటే ఎంపీడీవో కార్యాలయ సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో గాని, ఆన్‌లైన్‌లో గానీ ఈనెల 31లోపు ఎల్‌ఆర్‌ఎస్ పేమెంట్ చేస్తే.. 25శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వం రిబేట్ ఇస్తుందన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ కిరణ్ కుమార్, ఎంపీఓ శ్రీకాంత్, చౌటకూర్ పంచాయతీ కార్యదర్శి సందీప్ గౌడ్ , సుల్తాన్‌పూర్ కార్యదర్శి పావని, ఎల్‌ఆర్‌ఎస్ అభ్యర్థులు పాల్గొన్నారు.

వర్గీకరణ ప్రకారమే ఉద్యోగ నియామకాలు చేపట్టాలి

నవతెలంగాణ-జహీరాబాద్



ఎస్సీ వర్గీకరణ ప్రకారమే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని ఎమ్మెఎస్పీ జిల్లా అధ్యక్షులు అబ్రహం మాదిగ డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని త్వరగా అమలులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తూ జహీరాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నాల్గొ రోజైన శనివారం న్యాల్కల్ మండల ఇంచార్జి డి.జైరాజ్ మాదిగ ఆధ్వర్యంలో మండల ప్రతినిధులు దీక్షలో కూర్చున్నారు. అబ్రహం మాదిగ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ లేకుండా ఉద్యోగాలు భర్తీ చేస్తే ఎస్సీ ఉద్యోగాలన్ని మాలలకే చెందుతాయన్నారు. ఎస్సీల్లో అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు ఎస్సీ వర్గీకరణ లేకపోవడంతో గత 70 ఏళ్లుగా ఉద్యోగ నియామకాల్లో తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఈ అన్యా యాన్ని గుర్తించే సుప్రీంకోర్టు అత్యున్నత రాజ్యాంగ ధర్మాసనం ఎస్సీ వర్గీకరణ బలపరుస్తూ చారిత్రక తీర్పును ఇచ్చిందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత కూడా రాష్ట్ర ప్రభుత్వం మాదిగలకు అన్యాయం చేయాలని ప్రయత్నించడం దారుణమన్నారు. మార్చి 17న ఎస్సీ వర్గీకరణ చట్టం అసెంబ్లీలో పెడతామని ప్రకటించిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం అప్పటి వరకు ఉద్యోగ పరీక్షల ఫలితాలు నిలిపివేస్తే ఏమైందని ప్రశ్నించారు. వెంటనే ఎస్సీ వర్గీకరణ చట్టం అసెంబ్లీలో ఆమోదించడంతో పాటు త్వరగా అమలులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కాగా గొల్ల లక్ష్మణ్ యాదవ్ , ముక్కన్ గారి మధులు ఈ దీక్షరే మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో. టీంకు మాదిగ, ప్రేమ్ కుమార్, రవికుమార్, సుకుమార్, మాణిక్, సుమన్, నిర్మల్, సుదర్శన్, సురేష్, అరుణ్, సుమన్, లాలప్ప, రాజు తదితరులు పాల్గొన్నారు.

గూడెం ఇంట కళ్యాణ వైభోగం

వైభవంగా గూడెం సంతోష్ రెడ్డి వివాహ వేడుక

నవతెలంగాణ-పటాన్‌చెరు



'గూడెం' ఇంట కళ్యాణ వైభోగం సంబురంగా సాగింది. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సోదరుడు మధుసూదన్ రెడ్డి ప్రథమ కుమారుడు సంతోష్‌రెడ్డి-సంగీతల వివాహం హైదరాబాద్‌లోని హైటెక్స్‌హాల్లో వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ అంగరంగ వైభవంగా జరిగింది. టీటీడీ నుంచి హాజరైన వేద పండితులు ప్రత్యేక ఆశీర్వచనం అందించారు. ఈ వివాహానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి రాజకీయ నాయకులతోతో పాటు పలువురు పారిశ్రామికవేత్తలు, అధికా రులు, పటాన్‌చెరు నియోజకవర్గం ప్రజలు హాజరై గూడెం ఆతిథ్యాన్ని స్వీకరించి వధూవరులను ఆశీర్వదించారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఆంధ్రప్రదేశ్ పిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిల దంపతులు, మాజీ మంత్రులు హరీశ్‌రావు, మల్లారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, పోచారం శ్రీనివాస్ రెడ్డి ఎంపీలు ఈటల రాజేందర్, రఘునందన్ రావు, వద్దిరాజు రవిచంద్ర, సురేష్ షెట్కార్‌తో పాటు నియోజకవర్గానికి చెందిన నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

కంకర తేలిన రోడ్లు..

- పదేండ్లుగా మరమ్మతులకు నోచుకోని వైనం
- ఇబ్బంది పడుతున్న జనం

నవతెలంగాణ-మనూర్



మండలంలోని దోసపల్లి, బాధల్‌గవ్, మైకోడ్, ఎల్గొయి, దుదగొండ, బోరంచ, మొగ్ధంపూర్ తదితర గ్రామాల రోడ్లు కంకర తేలి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలినడక వెళ్లే వారి పరిస్థితి మరీ దారుణంగా ఉన్నది. నడుచుకుంటూ వెళ్తున్నప్పుడు తేలిన కంకర రాళ్ల వల్ల గాయాలు కూడా అవుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. గత పదేండ్ల నుంచి ఈ రోడ్లకు మరమ్మతులు చేంయించలేదని స్థానికులు మండిపడుతున్నారు. రోడ్లు మొత్తం పెద్ద గుంతలతో పాటు కంకర తేలి ఉండడంతో ప్రయాణాలుకష్టతరం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్ల వల్ల గ్రామాలకు అంబులెన్స్ కూడా రావడం లేదని వాపోతున్నారు. ఈ విషయమై అధికారులకు పలుమార్లు తెలియజేసిన ఫలితం లేకుండా పోయిందన్నా రు. స్థానిక ఎమ్మెల్యే డా పి.సంజీవ్ రెడ్డి చొరవతీసుకుని రోడ్లు బాగు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

బసవేశ్వరా జెండా ఆవిష్కరణ

నవతెలంగాణ-మనూర్



మండలంలోని దోసపల్లి చౌరస్తా వద్ద బసవేశ్వర్ విగ్రహం నిర్మాణం కోసం శనివారం దత్తు బీరదార్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేశారు. గతంలో ఏర్పాటు చేసిన స్థలం దగ్గర హైవే రోడ్డు పనులు చేయడంతో కొత్తగా ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నారాయణ ఈరన్న, కుశప్ప, అశోక్, సత్యనారాయణ, శర్నప్ప, మారుతీ తదితరులు పాల్గొన్నారు.



క్షేత్రస్థాయిలో విద్యుత్ అధికారుల పర్యటన

నవతెలంగాణ-గుమ్మడిదల

మండలంలోని కొత్తపల్లి, నాగిరెడ్డిగూడెం గ్రామాల్లో గల రైతుల పంట పొలాల వద్ద విద్యుత్ శాఖ ఏడీఈ దుర్గాప్రసాద్, ఏఈ రవీందర్ శనివారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. పొలాల వద్ద వున్న విద్యుత్ సమస్యల గురించి రైతులను నేరుగా అడిగి తెలుసుకున్నారు.విద్యుత్ ట్రాన్స్ఫార్మర్స్‌లో ఏమైనా సమస్యలు ఉన్నటయితే వెంటనే సంబంధిత లైన్ మెన్, జేఎల్ఎంలను లేదా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. తద్వారా సత్వరమే సమస్య పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటా మన్నారు. రైతు లు, విద్యుత్ వినియోగదారుల పట్ల విద్యుత్ అధికారులు స్నేహపూ ర్వకంగా వ్యవహరిస్తామన్నారు.ఈ కార్యక్ర మంలో రైతులు పాపయ్య, ఆంజనే యులు, శ్రీనివాస్, సాయి రెడ్డి, అంజి రెడ్డి విద్యుత్‌సిబ్బంది తదితరులున్నారు.

డంపింగ్‌యార్డ్ ఏర్పాటును నిరసిస్తూ నిరాహార దీక్షలు

నవతెలంగాణ-గుమ్మడిదల

మండలంలోని ప్యారానగర్ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డ్ ను నిరాకరిస్తూ రిలే నిరాహార దీక్షలు 39వ రోజు కొనసా గుతున్నాయి. అందులో భాగంగా గుమ్మడిదల, కొత్తపల్లి, నల్లవల్లి శివాజీ విగ్రహం దగ్గర ఏర్పాటు చేసిన దీక్షా శిబిర ంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమానికి గుండవరం వేణుగోపాలరావు, మండల జేఏసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు, పెన్నులు పంపిణీ

నవతెలంగాణ-కౌడిపల్లి



మండలంలోని బాలికల ఉన్నత పాఠశాలలో 46 మంది పదవ తరగతి విద్యార్థినీలకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, హాల్ టికెట్ కవర్‌లను మెదక్ జిల్లా ఆర్యవైశ్య సంఘం కార్యవర్గ సభ్యులు, కౌడిపల్లి కాంగ్రెస్ నాయకులు కౌడ శ్రీనివాస్ గుప్తా శనివారం అందజేశారు. ఈ సందర్భంగా కౌడ శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు కష్టపడి చదివి 10 జీపీ సాధించి మండలంలోనే టాపర్‌గా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. పరీక్షలు బాగా రాసి మండల టాపర్‌గా నిలిచిన వారికి తన వంతు సహాయం అందజేస్తానన్నారు. విద్యార్థినిలు పరీక్షల్లో మార్కులు తక్కువ వచ్చాయని, ఫేయిల్ అయ్యామని నిరుత్సాహం చెంది ఎలాంటి ప్రలోబాలకు పాల్పడకుండా ముందుకు వెళ్లాలని అప్పుడే అనుకున్నది సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జగన్, ఏసు, ఉపాధ్యాయులు సాజిత్ అలీ, అనిత, మమత, అనిత, అమూల్య, స్నేహలత, లత, అనిత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చంద శ్రీధర్‌కి ఉగాది పురస్కారం

నవతెలంగాణ-సంగారెడ్డి



హైదరాబాద్‌లోని రవీంద్రభారతి కళాక్షేత్రంలో తార ఆర్ట్స్ అకాడమీ వారు సమాజంలో చంద శ్రీధర్ చేస్తున్న సమాజసేవకు గుర్తింపుగా ఉగాది పురస్కారంతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సినీ నటుడు సుమన్ ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంగారెడ్డి పట్టణానికి చెందిన చంద శ్రీధర్ మాట్లాడుతూ తాను గత 25 సంవత్సరాలుగా చేస్తున్న సమాజసేవకు గుర్తింపుగా ఈ పురస్కారం లభించినట్లు తెలిపారు. తనకు ఉగాది పురస్కారాన్ని అందజసిన తార ఆర్ట్స్ అకాడమీ వారికి ధన్యవాదాలు తెలిపారు.

బ్యాగ్‌లాక్ సీట్ల ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు చేసుకోండి

- డీసీఓ టీ.హరిబాబు

నవతెలంగాణ-కౌడిపల్లి



మెదక్ జిల్లా మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల బాలుర, బాలికల పాఠశాలల్లో 6, 7, 8 ,9 తరగతులలో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ కొరకు విద్యార్థినీ, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని మెదక్ జిల్లా డీసీఓ టి.హరిబాబు సూచించారు. ఈ నెల 31వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, ఏప్రిల్ 20వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. కాగా కుటుంబ వార్షికాదాయం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంత విద్యార్థులకు రెండు లక్షలు మించరాదన్నారు. దాంతోపాటు బోనఫైడ్, ఆధార్ కార్డు, ఫోటోపై సంతకం, ఫోన్ నెంబర్, కుల ధృవీకరణ పత్రం, ఆదాయపత్రం ఉండాలన్నారు. ఆరవ తరగతి ప్రవేశానికి ఆగస్టు 31వ తేది నాటికి 12 సంవత్సరాలు మించకూడదన్నారు. 10 సంవత్సరాల వయసు తగ్గకుండా ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రెండు సంవత్సరాలు మినహాయింపు ఉందన్నారు. రూ.150 చెల్లించి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. హాల్ టికెట్లు ఏప్రిల్ 15న డౌన్లోడ్ చేసుకోవాలని, పరీక్ష ఏప్రిల్ 20న నిర్వహిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

వన దుర్గమ్మను దర్శించుకున్న పాట్నా హైకోర్టు న్యాయమూర్తి



నవతెలంగాణ -పాపన్నపేట

పాట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనువమ చక్రవర్తి శనివారం కుటుంబ సమేతంగా ఏడుపాయల వన దుర్గమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు పార్థివశర్మ శంకరశర్మ, ఇఓ చంద్రశేఖర్ ఆలయ మర్యాదల ప్రకారం వారికి పూర్ణ కుంభ స్వాగతం వలికారు. అనంతరం న్యాయమూర్తి దుర్గమ్మ తల్లికి అర్చన, ప్రత్యేక వూజలు చేశారు. అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలు అందజేసి, ఆలయ విశిష్టతను తెలిపారు. అడిషనల్ కలెక్టర్ నగేష్, ఆర్డీఓ రమాదేవి న్యాయమూర్తిని శాలువా, వూల మాలలతో సత్కరించారు. పావన్నపేట ఎమ్మార్వో సతీష్, పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ వారి వెంట ఉన్నారు.

నేడు కేసీఆర్, జగదీశ్వర్ రెడ్డిల దిష్టిబొమ్మలు దగ్ధం చేయాలి

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్

నవతెలంగాణ-నర్సాపూర్



అసెంబ్లీలో స్పీకర్ ప్రసాద్ కుమార్ పట్ల మాజీ మంత్రి ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి ఏకవచనంతో సభ మర్యాదను అగౌరవపరిచినందుకు కేసీఆర్, జగదీశ్వర్ రెడ్డిల దిష్టిబొమ్మలను దగ్దం చేయాలని డీసీసీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ పిలుపునిచ్చారు. టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పిలుపుమేరకు ప్రతి మండలంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డిల దిష్టిబొమ్మలను ఆదివారం దగ్దం చేయాలన్నారు. ఆదివారం ఉదయం పది గంటల వరకు అన్ని మండల కేంద్రాలలో జరిగే విధంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

హెూంగార్డు కుటుంబానికి రూ.70 వేల ఆర్థిక సాయం



నవతెలంగాణ-పాపన్నపేట : ఇటీవల గుండె పోటుతో మరణించిన తలారి మహెందర్ కుటుంబానికి అతని ఆత్మీయ మిత్రులు ఆర్థిక చేయూతను అందించి తమ స్నేహ ధర్మాన్ని చాటిన సంఘటన పావన్నపేట మండలం నాగ్సాన్ పల్లి లో శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్లో హెూంగార్డుగా పని చేస్తున్న తలారి మహేందర్ (39) ఈ నెల 11న గుండె పోటుతో మరణించారు. అతనికి భార్య భాగ్య, ఇద్దరు కొడుకులు సృజన్, కౌశిక్‌లు ఉన్నారు. మహేందర్ అకాల మరణంతో తీవ్ర ఆవేదనకు లోనైన, అతని చిన్ననాటి స్నేహితులు తలా కొంత నగదు జమచేసి, బాధిత కుటుంబానికి రూ.70 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, శ్యాం, అనిల్, రాకేష్, విఠల్, భరత్ ఉన్నారు.

డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు



నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ పట్టణంలో డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ఆదివారం 15వ వార్డు మాజీ కౌన్సిలర్ పంబల్ల బిక్షపతి ఆధ్వర్యంలో వార్డుకు చెందిన ప్రజలు దీక్షలో కూర్చున్నారు. మెదక్ జిల్లా బీజేపీ అధ్యక్షులు మల్లేష్ గౌడ్ రిలే నిరాహార దీక్షల వద్దకు వచ్చి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ డంపింగ్ యార్డ్‌ను ప్రజల అభిప్రాయం స్వీకరించకుండా నల్లవల్లి అడవుల్లో 150 ఎకరాల్లో స్వచ్ఛమైన అడవి ప్రాంతంలో వేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. స్వచ్ఛమైన అడవి వాతావరణాన్ని కలుషితం చేసే ఈ డంపింగ్ యార్డ్ ఈ ప్రాంతంలో నిర్మించవద్దని ఆయన మండిపడ్డారు. ప్రాణాలకు తెగించి అయినా ఈ డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు, రైతు సంఘాల నాయకులు, కుల సంఘాల నాయకులు, అఖిలపక్ష పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డివైడర్ లేని ఈ నేషనల్ హైవే ప్రయాణానికి భద్రమేనా...?



- రామాయంపేట మీదుగా నిర్మిస్తున్న రహదారిపై అనుమానాలెన్నో..!
- కాంట్రాక్టర్ లాభాల కోసమే రోడ్డు నాణ్యత తగ్గిస్తున్నారా..?
- ఇంజనీరింగ్ లోపాలు పేద కుటుంబాలకు శాపాలుగా మారనున్నాయా..?

నవతెలంగాణ-రామాయంపేట



రోడ్డు నిర్మాణాలలో ఇంజనీరింగ్ లోపాలు, సంబంధిత అధికారుల అవినీతి, నిర్లక్ష్యం కారణంగా దేశవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలు రోజురోజుకు పెరుగుతున్నాయని దేశవ్యాప్తంగా ఇప్పటికే పెద్దఎత్తున చర్చ జరుగుతున్న ఈ సమయంలో, మెదక్ జిల్లా రామాయంపేట మీదుగా నిర్మిస్తున్న నేషనల్ హైవే, స్థానిక ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. ఈ హైవే మధ్యలో డివైడర్ లేకుండా నిర్మాణం జరగడంతో పాటు, రోడ్డుపైన వెళ్లే పాదచారులకు సరైన ఏర్పాట్లు జరగడం లేదనే చర్చ జరుగుతుంది. నూతనంగా నిర్మాణం అవుతున్న ఈ నేషనల్ హైవే రోడ్డు భద్రతాపరంగా అనేక అనుమానాలను రేకెత్తిస్తుంది.

కాంట్రాక్టర్ లాభాల కోసమే నాణ్యత తగ్గిస్తున్నారా..?

ఈ మార్గాన్ని ఉపయోగించే ప్రయాణికులు, స్థానికులు రోడ్డులో తగిన భద్రతా ఏర్పాట్లు లేకపోవడంతో ప్రమాదాల ముప్పు పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు మధ్యలో డివైడర్ లేకపోతే, ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉంటుందని వాపోతున్నారు. రోడ్డు నిర్మాణ పనులను పర్యవేక్షించే సంబంధిత ఇంజనీరింగ్ సంస్థలు, భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నాయా? లేదా కేవలం కాంట్రాక్టర్ల లాభాల కోసం, రహదారి నాణ్యతను తగ్గిస్తున్నారా? అనే ప్రశ్నలు ఎదురవుతున్నాయి.

డివైడర్ లేని హైవే ఎందుకు ప్రమాదకరం

డివైడర్ లేని హైవే రోడ్డుపై ప్రయాణం చేసేటప్పుడు ప్రధానంగా ఎదురుగా వచ్చే వాహనాలను ఢీకొని ప్రమాదాలు పెరుగుతాయి. రాత్రివేళ ఎదురుగా వచ్చే వాహనాల హెడ్‌లైట్ వెలుతురు, ఎదురుగా వచ్చే వాహనాలు నడిపే వారి కళ్ళకు నేరుగా తగిలి డ్రైవింగ్‌లో ఆటంకం కలిగిస్తుంది. డివైడర్ ఉంటే, డివైడర్ ఎత్తుగా ఉండడం, డివైడర్‌పై ఉన్న పూల చెట్లు, వాహనాల లైటింగ్ ఎదురుగా వచ్చే వాహనాలు నడిపే వారి కళ్ళపై పడకుండా ఉంటుంది. డివైడర్ లేకపోతే, అంత విశాలమైన రోడ్డుపై స్వేచ్ఛగా ఓవర్‌టేకింగ్ చేయడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువ. పాదచారులకు రోడ్డు దాటడం మరింత ప్రమాదకరంగా మారుతుంది. దేశంలో ప్రతి రోజూ వందలాదిమంది రోడ్డు ప్రమాదాలలో ప్రాణాలు కోల్పోతున్నారు. వీటిలో నేషనల్ హైవే రోడ్లపై జరిగే ప్రమాదాలే ఎక్కువ.

డివైడర్ లేని రోడ్లు పేద కుటుంబాలకు శాపాలు కానున్నాయా..?

ప్రతిరోజు జరిగే రోడ్డు ప్రమాదాలలో, రోడ్డు నిర్మాణాలలో ఇంజనీరింగ్ లోపాల వల్లే అని పెద్ద ఎత్తున ఆరోపణలు ఉన్నాయి. రోడ్డు ప్రమాదాలలో ఎక్కువగా పేద మధ్యతరగతి కుటుంబాలే ప్రాణాలు కోల్పోతున్నారు. డివైడర్ లేకుండా నిర్మించే ఇలాంటి రోడ్లు, పేద కుటుంబాలకు శాపాలుగా మారనున్నాయా..? అనే అనుమానాలు రేకెత్తిస్తుంది. ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే, తక్షణమే డివైడర్ లేకుండా నిర్మిస్తున్న ఈ హైవే నిర్మాణాన్ని నిలిపివేయాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రయాణికుల భద్రతను ప్రాధాన్యంగా తీసుకుని, హైవే మధ్యలో డివైడర్ నిర్మించి, పాదాచారులకే కాకుండా, అన్ని రకాల సౌకర్యాలతో రోడ్డు నిర్మాణం జరపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై వివరణ కోసం సంబంధిత అధికారి డీఈ అన్నయ్యను ఫోన్‌లో సంప్రదించడానికి ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

విద్యార్థులు చదువుల పట్ల శ్రద్ధ వహించాలి

- జిల్లా విద్యాధికారి డాక్టర్ రాధా కిషన్

నవతెలంగాణ-చేగుంట



విద్యార్థులు సమయపాలన పాటించి చదువుల పట్ల శ్రద్ధ వహించాలని జిల్లా విద్యాధికారి డాక్టర్ రాధా కిషన్ పేర్కొన్నారు. చేగుంట మండల కేంద్రంలోని బాలికల ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కంప్యూటర్ ల్యాబ్ ను, తరగతి గదులను, అనంతరం మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. పదవ తరగతి ప్రత్యేక తరగతులను పరిశీలించి, విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి పౌరులని, ప్రతి విద్యార్థి లక్ష్యాలను నిర్ధారించుకొని వాటిని సహకారం చేసే విధంగా ప్రయత్నం చేయాలన్నారు. విద్యార్థులు చదువు పట్ల శ్రద్ధ వహించాలని, ఒక సమయపాలన పట్టికను ఏర్పాటు చేసుకొని చదవాలని, మీకు ఏమైనా సబ్జెక్టులలో సందేహాలు ఉంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. త్వరలో జరగబోయే పదో తరగతి పరీక్షల్లో ప్రతి ఒక్కరు మంచి ఉత్తీర్ణత సాధించి తల్లి తండ్రికి, గురువులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎమ్‌ఓ సుదర్శన మూర్తి, ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు రఘుపతి, ఉపాధ్యాయులు విజయలత, చల్లా లక్ష్మణ్, సుధాకర్ రెడ్డి, రాజేశ్వర్, వెంకటేష్, శారద, రాధా, రేఖ, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామంలో మాజీ ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన

నవతెలంగాణ-చిన్న శంకరంపేట



మండలంలోని ఎస్ కొండాపూర్ గ్రామంలో మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి శనివారం సుడిగాలి పర్యటన కావించారు. ఇటీవల మరణించిన వారి ఇళ్లలోకి వెళ్లి వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందించి వారిని పరామర్శించారు. అనంతరం ఆరు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న కార్యకర్తలను ఆదుకుంటామని భరోసా కల్పించారు. ఎమ్మెల్యే పదవిలో ఉన్న ఐదు సంవత్సరాలలో ఒక్కసారి కూడా ఎస్ కొండాపురంలో అడుగుపెట్టని మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి, ఇన్నాళ్లకు గ్రామంపై ఇంత ప్రేమ చూపించడం ఆనందదాయకమని ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యేతో పాటు మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రాజు, పూలపల్లి యాదగిరి, ప్రసాద్ గౌడ్, సిద్ధి రాములు తదితరులు ఉన్నారు.

నస్కల్ ఎంపిపిఎస్‌లో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ బోధన

నవతెలంగాణ-నిజాంపేట్



మండల పరిధిలోని నస్కల్ ప్రాథమిక పాఠశాల (ఎంపీపీఎస్)లో శనివారం రోజున ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బోధన విధానాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సాగరిక ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కూడా సాంకేతిక పరిజ్ఞానంతో పోటీపడేలా, సి,గ్రేడ్ విద్యార్థులలో ఉన్న సామర్థ్యాలు బయటపడేలా, విద్యార్థుల హాజరు పెంచేలా, వినూతన విద్యలో భాగంగా నూతన విద్య విధానాన్ని జిల్లాలోని 17 పాఠశాలలో భాగంగా నిజాంపేట మండలం పరిధిలో నస్కల్ ప్రాథమిక పాఠశాల ఎంపిక కావడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎంపిక కార్యక్రమానికి కృషి చేసిన జిల్లా విద్యాధికారి రాధా కిషన్, మండల ఎంఈఓ యాదగిరి, జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు సత్యంకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపిపిసి చైర్మన్ హేమలత ఉపాధ్యాయులు శ్రీనివాస్, ఎల్లం, మన్మథ, జాకియా, రాజశేఖర్, రాజయ్య, తల్లిదండ్రులు పున్నమ్మ అపర్ణ, సావిత్రి, సుమలత, నగేష్ యాదవ్, మహేష్ చారి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-నర్సాపూర్: మద్యానికి బానిసై గుర్తుతెలియని పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన నర్సాపూర్ మండల పరిధిలోని అహ్మద్ నగర్ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన పోలీసులు, కుటుంబీకుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నేరేడు జైపాల్ (35) మేస్త్రి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత రెండు సంవత్సరాలుగా ఎటువంటి పనిచేయకుండా ఊర్లో తిరుగుతూ మద్యానికి బానిసై డబ్బుల కోసం తరచు భార్యతో గొడవ పడుతూ ఉండేవాడు. భార్య డబ్బులు ఇవ్వకపోతే చనిపోతానని ఒకసారి ఉరిపోసుకొని, మరోసారి గ్యాస్ లీకేజ్ చేసి చనిపోతానని పలుమార్లు బెదిరించాడు. ఈ విషయమై గ్రామంలో గ్రామస్తులు పలుమార్లు జైపాల్‌కు నచ్చ చెప్పినప్పటికీ జైపాల్ తీరు మారలేదు. శుక్రవారం జైపాల్ బాగా మద్యం తాగి వచ్చి స్నానం చేసిన తర్వాత ఇంటి బయటకు వెళ్లి స్మశాన వాటికలో గుర్తు తెలియని గడ్డి మందు తాగి ఇంటికి వచ్చి వాంతులు చేసుకున్నాడు. ఇది గమనించిన అతని భార్య కుటుంబ సభ్యులు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. శనివారం గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడి భార్య సౌందర్య ఫిర్యాదు మేరకు ఎస్సై బి లింగం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

గ్రూప్-3 స్టేట్ టాపర్ అర్జున్ రెడ్డికి ప్రెస్ క్లబ్ సన్మానం

నవతెలంగాణ-పాపన్నపేట

గ్రూప్-3లో స్టేట్ టావర్‌గా నిలిచిన కూకునూరి అర్జున్ రెడ్డి, ఆయన తండ్రి నరేందర్ రెడ్డిని శనివారం పావన్నపేట ప్రెస్ క్లబ్ ఘనంగా సన్మానించింది. మెదక్ కలెక్టరేట్లో అటు ఉద్యోగం చేస్తూ, ఇటు పోటీ పరీక్షలకు సన్నద్ధమై , ఇటీవల ప్రకటించిన గ్రూప్-2లో 18వ ర్యాంకు, గ్రూప్-3లో స్టేట్ టాపర్‌గా నిలిచి అర్జున్ రెడ్డి నేటి యువతకు ఆదర్శంగా నిలిచాడని ప్రెస్ క్లబ్ సభ్యులు పేర్కొన్నారు. ఆయన అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని, ప్రభుత్వ అధికారిగా ప్రజలకు మంచి సేవలు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీయు డబ్లుజే రాష్ట్ర ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ సోషల్ మీడియా సమన్వయ కమిటీ బాధ్యులు మిన్పూర్ శ్రీనివాస్, జిల్లా టీయు డబ్లుజే కార్యవర్గ సభ్యులు సుమన్, పావన్నపేట మండల ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి భాస్కర్, ఉపాధ్యక్షులు సత్యనారాయణ, కోశాధికారి సంగమేశ్వర్, కార్యదర్శి ప్రసాద్, అంతు శ్రీను, మల్లంపేట మాజీ సర్పంచ్ బాపురెడ్డి, రిటైర్డ్ ఎంఇఓ మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.



అంగన్ వాడిల సమస్యలు పరిష్కారించాలి

నవతెలంగాణ-మెదక్ టౌన్



అంగన్ వాడిల సమస్యలు పరిష్కారించాలని అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కడారి నర్సమ్మ డిమాండ్ చేశారు. అంగన్వాడి సమస్యల పరిష్కారం చేయాలని కోరుతూ 2 రోజుల రోజుల పాటు జరిగే సమ్మెలో పాల్గొంటామని అంగన్ వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మెదక్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం సిడిపిఓకి సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా కడారి నర్సమ్మ మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్ సమావేశాల సందర్భంగా రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మెదక్ జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ కార్యాలయం ఎదుట మార్చి 17, 18 తేదీలలో రెండు రోజులపాటు ధర్నా నిర్వహిస్తామన్నారు. అంగన్వాడి వర్కర్స్ అందరూ, అన్ని ప్రాజెక్టులలోని టీచర్లు, హెల్పర్లు, మిని వర్కర్లు ఈ సమ్మెలో పాల్గొంటారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలన్నారు.

ఆసుపత్రుల ద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలు

జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

నవతెలంగాణ-వెల్దుర్తి



జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా శనివారం మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. రోజువారి ఔట్ పేషెంట్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. ఫార్మసీ గదిని పరిశీలించారు. సంబంధిత డాక్టర్లను, పేషెంట్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. హాస్పిటల్‌కి వచ్చే రోగులతో ఆప్యాయతతో మాట్లాడాలని సూచించారు. మీ మాటలతోటే రోగుల జ్వరం సగం పోవాలని సూచించారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. తప్పనిసరిగా సమయపాలన పాటించి రోగులకు అందుబాటులో ఉండేలాగా చూడాలన్నారు. ఆసుపత్రిలో పేషెంట్ల హక్కులు, కర్తవ్యాలు, వివరాలు తెలిపే బోర్డును ప్రదర్శించాలన్నారు. కలెక్టర్ వెంట వైద్య సిబ్బంది తహశీల్దార్ కృష్ణ, ఆర్ఐ ఉన్నారు.

అన్ని గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలి

- నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-చేగుంట



కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో అన్ని గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. చేగుంట మండలం రుక్మాపూర్ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మంజూరైన రూ,10 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులను శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అనేక అభివృద్ధి పనులు చేస్తుందని, అలాగే మన ప్రభుత్వ హాయంలో మండలంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేసుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్, పిఎసిఎస్ చైర్మన్ మేకల పరమేష్, ఎస్సీ సెల్ అధ్యక్షులు స్టాలిన్ నర్సింలు, సీనియర్ నాయకులు తాడెం వెంగళరావు, పుర్ర ఆగం, అన్నం ఆంజనేయులు, యువజన నాయకులు సంద్రుగు శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్‌కు అవధూతగిరి మహారాజ్ పాదయాత్ర

నవతెలంగాణ-జహీరాబాద్



ఝరాసంగం మండలంలోని బర్దిపూర్ దత్తగిరి ఆశ్రమం నుంచి ఊరేగింపుగా బయలుదేరిన పాదయాత్ర, పళ్ళకి సేవ బృందం జహీరాబాద్ పట్టణా నికి చేరుకున్నది. శ్రీశ్రీశ్రీ 1008 వైరాగ్యం శికమణి అవధూతగిరి మహారాజ్ డాక్టర్ మహంత్ పరమహంస పరివ్రాజకాచర్య మహ మండలశ్వర్ సిద్దేశ్వరానంద గిరి మహారాజ్ స్వామి ఆధ్వర్యంలో ఈ పాద యాత్ర సాగుతుంది. ఈ నేపథ్యంలో శనివారం పస్తపూర్‌లో గల జేకే కన్స్ట్రాక్షన్ కార్యాలయంలో గుంజేటి తాజా మాజీ ఎంపీటీసీ బొమ్మ దేశెట్టి పాటిల్ బృందం ఆ పాదయాత్రను వారి కార్యాలయానికి ఆహ్వానించారు. పల్లకిసేవ పాదయాత్రలో ఉన్న భక్తులకు చల్లటి పానీయాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మఠం చంద్రశేఖర్ స్వామి, జ్యోతిష్య పురోహితులు నరేష్ స్వామి, రవికాంత్ గోపన్ పల్లి, శ్రీకర్ మడివల్, జగదీష్ సాగర్, అనిల్ దేవగిరి, శ్రీకాంత్, మొహమ్మద్ హుస్సేన్ తదితరులుపాల్గొన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

నవతెలంగాణ-జిన్నారం



పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించాలని మాదారం గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ సరిత సురేందర్ గౌడ్ ఆకాంక్షించారు. మాదారం యువజన వికాస సమితి సౌజన్యంతో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా పరీక్ష ప్యాడ్లు కిట్లను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సరితా సురేందర్ గౌడ్ మాట్లాడుతూ.. సామాజిక సేవా దృక్పథంతో విద్యార్థులకు ఉపయోగకరమైన సామాగ్రిని పంపిణీ చేయడం పట్ల యువజన వికాస సమితి అధ్యక్షులు విజయ్ కుమార్, విజయ్ గౌడ్ బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో మాదారం జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు కవిత యువజన వికాస్ సమితి అధ్యక్షులు బి విజయకుమార్, జనరల్ సెక్రెటరీ ఎస్.విజయ్ గౌడ్, జాయింట్ సెక్రెటరీ సత్యనారాయణ, ట్రెజర్ షణ్ముఖ, ఉపాధ్యాయులు కృష్ణ గౌడ్, సత్యనారాయణ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వివరాలు లేని వస్తువులు కొనొద్దు



-డిస్టిక్ లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రెటరీ స్వాతి రెడ్డి

నవతెలంగాణ-సిద్ధిపేటరూరల్

వివరాలు లేని వస్తువులు కొనొద్దని డిస్టిక్ లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రెటరీ స్వాతి రెడ్డి అన్నారు. వరల్డ్ కన్స్యూమర్ రైట్స్ డే సందర్భంగా శనివారం నారాయణరావుపేట గ్రామపంచాయతీలో లీగల్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్వాతి రెడ్డి పాల్గొని మాట్లాడుతూ.. వినియోగదారులకి ఉన్న హక్కుల గురించి వివరించారు. ఏదైనా వస్తువు కొన్నప్పుడు వాటి మీధ ఉండే ప్రతి అంశాన్ని పరిశీలించాలని, ఎక్స్పైరీ డేట్ చూసి కొనుగోలు చేయాలని అన్నారు. ఇతర సమస్యలు ఉంటె ఆ కంపెనీ వాళ్ళని కాంటాక్ట్ అవొచ్చని తెలిపారు. ఎమ్మార్పీ రేట్ కంటే ఎకువ అమౌంట్‌కి అమ్మితే ఆ షాప్ వారి మీద చట్టపరమైన చర్యలు తిస్కోవచని తెలిపారు. వినియోగదారులకి ఎటువంటి సమస్యలు ఉన్న కన్స్యూమర్ కోర్ట్‌లో ఫ్రీగా కేసు వేయోచ్చని లేదా కన్స్యూమర్ రైట్స్ హెల్ప్ లైన్ నంబర్స్ 1800-11-4000 లేదా 1915 కి కాల్ చేసి సంప్రదించాలని తెలిపారు. అలాగే న్యాయపరమైన సలహాలు, సూచనల కోసం 15100 టోల్ ఫ్రీ నెంబర్ సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై అపూర్వ రెడ్డి, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

బస్టాండు కూల్చేందుకు యత్నం



నవతెలంగాణ-మర్కుక్

మండల పరిధిలోని గణేష్ పల్లి గ్రామ చౌరస్తాలో గత 40 ఏండ్ల క్రితం సత్య సాయి సేవా ట్రస్టు వారు ప్రయాణికుల కోసం బస్టాండును నిర్మించారు. అది కాస్త ఇటీవల కూలిపోయింది. శనివారం బస్టాండు వెనకాల ఉన్న షాటర్ల ఎదరుగా ఉందని బస్టాండు కూల్చేందుకు యత్నినించారు. ఇది గమనించిన గ్రామస్తులు జేసీబీని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గణేష్ పల్లి కాంగ్రెస్ గ్రామాధ్యక్షులు, మాజీ వార్డు సభ్యులు చీకోటి రవి మాట్లాడుతూ.. 40 ఏండ్ల క్రితం నిర్మించిన బస్టాండు దుకాణ సముదాయాలకు అడ్డంగా ఉందని మాజీ సర్పంచ్ అండతో కూల్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. త్వరలోనే బస్టాండు పునర్ నిర్మాణం చేస్తామన్నారు. బస్టాండు కూల్చేస్తే ఊరుకునేది లేదన్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

ఇద్దరు విద్యార్థులు మాల్ ప్రాక్టీస్

నవతెలంగాణ-సిద్ధిపేట

ఇంటర్ రెండో సంవత్సరం శనివారం జరిగిన గణితం, రిలేషన్ డాటాబేస్ మేనేజ్మెంట్ సిస్టం పరీక్షలో ఇద్దరు విద్యార్థులు చిట్టీలు రాస్తూ దొరకడంతో వారిని మాల్ ప్రాక్టీస్ కింద బుక్ చేసినట్టు జిల్లా ఇంటర్ విద్యాధికారి రవీందర్ రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చిట్టీలు కొట్టి తమ పరీక్షలను వేస్ట్ చేసుకోవద్దని, మళ్లీ పరీక్షలు రాయాలంటే సమయం, డబ్బు వృథా అవుతుందని, బాగా చదివే పరీక్షలు రాయాలని విద్యార్థులను కోరారు.

సత్యనారాయణను పరామర్శించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-రాయపోల్



బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కర్నాల శ్రీనివాస్ అనారోగ్యంతో బాధపడుతుంటే విషయం తెలుసుకొని శనివారం హైదరాబాద్ అపోలో ఆసుపత్రిలో దుబ్బాక నియోజ కవర్గం శాసనసభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాయపోల్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కర్నాల సత్యనారాయణ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయన ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని, మెరుగైన వైద్యం అందించాలని వైద్యులతో మాట్లాడారు. వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం అందించారు.

అధికారం ఉందని సస్పెండ్ చేస్తారా..?



-బీఆర్ఎస్ నాయకుల నిరసన, సీఎం రేవంత్ దిష్టిబొమ్మ దగ్ధం

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

బిఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డిని అధికారం ఉందని కాంగ్రెస్ ప్రభుత్వం సస్పెండ్ చేసిందని, దీనికి వ్యతిరేఖంగా శనివారం హుస్నాబాద్ పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మ దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. జగదీశ్ రెడ్డి మాటలను వక్రీకరిస్తూ సస్పెండ్ చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైఖరి మార్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గంగం మదన్ మోహన్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు అన్వర్, మున్సిపల్ మాజీ చైర్మెన్ ఆకుల రజిత, బిలేని మల్లికార్జున్ రెడ్డి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఒంటి పూట బడులు

నవతెలంగాణ-సిద్ధిపేట



వేసవికాలం దృష్ట్యా ప్రభుత్వం శనివారం నుంచి ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో సగం పూట బడులను ప్రారంభించింది. శనివారం పట్టణంలోని బాలికల ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నం 12:30 గంటలకు పాఠశాలలను వదలగానే విద్యార్థులు బయటకు వస్తున్న దృశ్యం. విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులు పాఠశాలను విడిచిపెట్టగానే మధ్యాహ్న భోజనం చేసి ఇంటికి వెళ్తున్నారు.

దామరకుంట పాఠశాలకు పోడియం బహుకరణ



నవతెలంగాణ-మర్కుక్

మండల పరిధిలోని దామరకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భౌతికశాస్త్ర ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వై. చిన్న బ్రహ్మయ్య పాఠశాలకు ఆయన తల్లి మహాలక్ష్మి జ్ఞాపకార్థం రూ.12550 విలువగల పోడియమును శనివారం అందజేశారు .ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి వెంకటరాములు, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులున్నారు.

జాతీయస్థాయిలో జిల్లా విద్యార్థినికి మొదటి స్థానం

నవతెలంగాణ-సిద్ధిపేట



విద్యా భారతి సంస్కృతి శిక్షా సంస్థాన్ న్యూఢిల్లీ వారు నిర్వహించిన జాతీయస్థాయి వ్యాసరచన పోటీల్లో శ్రీ సరస్వతీ శిశు మందిర్ 5వ తరగతి విద్యార్థినీ కాసోజు లక్ష్మీ హంసిని ప్రథమ స్థానంలో నిలిచినట్లు పాఠశాల ప్రధాన ఆచార్యులు మోతుకు నరేష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని లక్ష్మీ హంసినికి ప్రశంసా పత్రం, షీల్డ్ ఇచ్చి సత్కరించారు.

మల్లన్న హుండీ ఆదాయం రూ.14 లక్షలు

నవతెలంగాణ-దుబ్బాక



దుబ్బాక మున్సిపల్ పరిధిలోని రేకులకుంట మల్లికార్జున స్వామి దేవస్థానంలో శనివారం కూచాద్రి వెంకటేశ్వర స్వామి దేవస్థాన ఈవో వీ.శ్రీనివాస్ పర్యవేక్షణలో నిర్వహించిన హుండీ లెక్కింపు (గతేడాది మే 29 నుండి ఈ ఏడాది మార్చి 15 వరకు) ప్రక్రియలో రూ.14,30,405లు సమకూరినట్లు ఆలయ ఈవో విశ్వనాథ శర్మ చెప్పారు. ఈ మొత్తం నగదును బ్యాంకులో జమ చేస్తామన్నారు.హుండీ లెక్కింపు ప్రక్రియలో పాల్గొన్న సిద్దిపేట కోటిలింగాల సేవాసమితి, దుబ్బాక రాజరాజేశ్వర సేవాసమితి సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

రుణమాఫీ మంజురిలో కాంగ్రెస్ ఆధిక్యం

-అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటన

నవతెలంగాణ-గజ్వేల్



గజ్వేల్ నియోజకవర్గంలో గత ఐదు సంవత్సరాల్లో కేవలం రూ.104 కోట్లు మాత్రమే కేసీఆర్ రుణమాఫీ చేశారని, ఇప్పుడు కాంగ్రెస్ ఒక సంవత్సరంలోనే గజ్వేల్ నియోజ కవర్గం 30 వేల 400 అకౌంట్లకు రూ.234 కోట్ల రుణమాఫీ రైతులకు చేసినట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. శనివారం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా రుణమాఫీ చర్చ జరుగుతున్న సమయంలో రాష్ట్ర ప్రతిపక్ష నేత కేసీఆర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ చేసిన రుణమాఫీ గురించి భట్టి వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పార్టీలకు అతీతంగా ఎమ్మెల్యేల కచ్చితంగా రుణమాఫీ చేస్తుందని కేసీఆర్ నియోజకవర్గంలోనే 30 వేల మంది రైతులకు చేసిన ఘనత కాంగ్రెసుకు ఉందని ఆయన చెప్పుకొచ్చారు.

ఏఐ ఆధారిత బోధనతో విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి

- పలు పాఠశాల్లో కంప్యూటర్ ఆధారిత విద్యాబోధన ప్రారంభం

నవతెలంగాణ-కొండపాక

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) బోధనతో విద్యార్థుల నైపుణ్యం పెంపొందుతుందని కుకునూరుపల్లి ఎంఈఓ బచ్చలి సత్తయ్య అన్నారు. జిల్లాలో ప్రయోగాత్మకంగా పలు పాఠశాలల్లో ఏఐ ఆధారిత బోధనను శనివారం ప్రారంభించారు. మండలంలో రెండు పాఠశాలలు ఎంపిక కాగా తిప్పారం ప్రాథమిక పాఠశాల, మంగోల్ ప్రాథమిక పాఠశాల్లో ఏఐ ఆధారిత బోధనను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఈ ఏఐ బోధన ఉపయోగపడుతుందన్నారు. సాంకేతిక పరిజ్ఞానం వారిలో అభివృద్ధి చెందుతుందన్నారు. మానసిక వికాసం పెంపొంది చదువు పట్ల ఆసక్తి పెరుగుతుందన్నారు. విద్యార్థుల్లో ఈ బోధన ద్వారా అభ్యసన సామర్థ్యాలు పొందుతాయన్నారు. కార్యక్రమంలో తిప్పారం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజ్ బహదూర్, మంగోల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగ ప్రభాకర శాస్త్రి, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ రవి, మధురవాణి,



రామకృష్ణారెడ్డి, మాధురి, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-రాయపోల్

పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులకు కంప్యూటర్ ఆధారిత విద్యాబోధన ప్రారంభించామని మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ రెడ్డి అన్నారు. శనివారం రాయపోల్ మండలం కొత్తపల్లి, రాంసాగర్, అనాజిపూర్, వడ్డేపల్లి ప్రాథమిక పాఠశాలలో కంప్యూటర్ ఆధారిత విద్యా విధానం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ టూల్స్ సహాయంతో ఎఫ్ఎల్ఎన్‌లో వెనుకబడిన సి- గ్రేడ్ విద్యార్థులకు కంప్యూటర్ ఆధారిత బోధనను ప్రారంభించామన్నారు. కొత్త పల్లీ పాఠశాలలో మూడు కంప్యూటర్లు ఏర్పాటు చేశారు. అదేవిధంగా ప్రాథమిక పాఠశాల రామ్ సాగర్, వడ్డేపల్లి, అనాజిపూర్ పాఠశాలలో ఆవరణలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రామ్ సాగర్, అనాజిపురం, వడ్డేపల్లిలో ప్రాథమిక పాఠశాలల విద్యార్థుల కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టూల్స్ తరగతులను ప్రారంభించామన్నారు. ఏఐ ఆధారిత సాఫ్ట్వేర్ సహకారంతో విద్యార్థుల స్వయం అభ్యసనతో వారిని సీ- గ్రేడ్ నుండి బి, ఏ గ్రేడ్ వారిగా అభ్యసనంలో ముందుకు తీసుకువెళ్లడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, విజయ, గోవర్ధన్, నిర్మల కుమారి, నర్సింలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



దళారులను ఆశ్రయించి రైతులు నష్టపోవొద్దు

-పండించిన పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది

-ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్

రైతులు పండించిన పంటలను ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేస్తుండగా, దళారులను ఆశ్రయించి రైతులు నష్టపోవద్దని ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి పేర్కొన్నారు. శనివారం గజ్వేల్ మార్కెట్ యార్డు ఆవరణలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శనగలు, పొద్దు తిరుగుడు కొనుగోలు కేంద్రాలను గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ వంటేరు నరేందర్ రెడ్డి, వైస్ చైర్మెన్ సర్దార్ ఖాన్, ఫ్యాక్స్ చైర్మెన్ వెంకట్ గౌడ్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యంగా చర్యలు తీసుకుంటూ అవసరమైన చోట కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు స్పష్టం చేశారు. శనగలకు మద్దతు ధర క్వింటాలుకు రూ 5650, పొద్దు తిరుగుడుకు రూ.7280 ప్రభుత్వ మద్దతు ధర ప్రకటించినట్లు తెలిపారు. అయితే నిబంధనల మేరకు రైతులు పండించిన ఈ పంటలను కొనుగోలు కేంద్రాలకు తరలించి ఆర్థికంగా ప్రయోజనం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఏడీఏ బాబు నాయక్, మార్కెట్ కమిటీ సెక్రటరీ జాన్ వెస్లీ, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కరుణాకర్ రెడ్డి, నర్సింహ రెడ్డి, శ్రీనివాస్ గుప్త, డాక్టర్ వహీద్, యాదగిరి, శ్రీనివాస్ గౌడ్, భానుప్రియ, నేతలు జంగం రమేష్ గౌడ్, శివారెడ్డి, రాములు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఎంజేపీ మహిళ గురుకులంలో దశాబ్ది వేడుకలు

నవతెలంగాణ-వర్గల్

మండలంలోని మహాత్మ జ్యోతి బాపూలే మహిళా గురుకులంలో దశాబ్ది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా హార్టికల్చర్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ దండ రాజిరెడ్డి, గురుకుల సంస్థ జాయింట్ సెక్రటరీ శ్యామ్ ప్రసాద్ లాల్ హాజరయ్యారు. అతిథులకు విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా దశాబ్ది మేగజైన్‌ను కళాశాల ప్రిన్సిపల్ భాస్కర్ రావు ఆవిష్కరించారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయడంలో భాగంగా "కవనం" అనే పుస్తకాన్ని ఆవిష్కారించారు. గత పది సంవత్సరాల్లో విద్యార్థులు సాధించిన విజయాలను, ఉద్యోగాలను గురించి విద్యార్థులకు వివరించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యాక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఈజీలో లక్ష్మయ్య, డాక్టర్ లింగం, శైలజ, విద్యార్థులు, అధ్యాపక బృందం, తదితరులు పాల్గొన్నారు.



పలు గ్రామాల్లో సీసీ రోడ్ల పనులు ప్రారంభం



నవతెలంగాణ-నంగునూరు

మండలంలోని గట్ల మల్యాల గ్రామంలో శనివారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను తెలంగాణా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామానికి జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా రూ.35 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. గంగిరెద్దుల కాలనీ లో మొత్తం సీసీ రోడ్లు నిర్మాణం జరుగుతాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం కోసం మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడం కోసం కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి, కార్యకర్తల కోసం నియోజకవర్గం ఇంచార్జి పూజల హరికృష్ణ నిబద్దతతో ముందుకు వెళ్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు గాండ్ల రమేష్, యువజన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బాగు శ్రీకాంత్ యాదవ్, తాజా మాజీ సర్పంచ్ తిప్పని రమేష్, మాజీ ఎంపీటీసీ రవీంద్ర చారి, కాంగ్రెస్ నాయకులు కుసుంబ రాజేశం, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-మర్కుక్

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ జిల్లా అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. శనివారం మండల



పరిధిలోని దామరకుంట, కాశిరెడ్డిపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ మర్కుక్ మండలాధ్యక్షులు తాండ కనకయ్య గౌడ్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు బబ్బూరి మల్లేశం గౌడ్, దామరకుంట కాంగ్రెస్ గ్రామాధ్యక్షులు పత్తి నర్సింలు యాదవ్, కాశిరెడ్డిపల్లి కాంగ్రెస్ గ్రామాధ్యక్షులు సింగం వెంకటేష్‌తో కలసి సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు ర్యాకం యాదగిరి, సుగుణాకర్ రెడ్డి, జితేందర్ రెడ్డి, బీర్బల్ సింగ్,ప్రభాకర్, బాబి, జైపాల్ రెడ్డి, సత్యనారాయణ, శంకర్, తదితరులున్నారు.

విద్యార్థులు చదువుల్లో రాణించాలంటే తల్లిదండ్రుల పాత్ర కీలకం

- ప్రధానోపాధ్యాయులు అయోధ్య

నవతెలంగాణ-చేర్యాల

విద్యార్థులు ఉన్నత స్థాయి చదువుల్లో రాణించాలంటే తల్లిదండ్రుల పాత్ర చాలా కీలకమని, విద్యపట్ల వారు కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులు అయోధ్య సూచించారు. చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యా బోధన చేస్తున్నారా లేదా..? పిల్లలు బాగా చదువుతున్నారా.. ? అనే విషయాలు తెలుసుకోవాలంటే ప్రతీ తల్లిదండ్రి ఉపాధ్యాయులు నిర్వహించే సమావేశాలకు తప్పనిసరి హాజరుకావాల్సి ఉంటుందని తెలిపారు. అనంతరం విద్యార్థుల చేత చిత్రలేఖన చేపించి,



కథలు రాసి చెప్పించారు. అనంతరం ఇటీవల టీఎల్ఎం మేళాలో ఆకునూరు పాఠశాలకు గణితంలో మొదటి బహుమతి రావడంతో హెచ్ఎం, ఉపాధ్యాయులకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు అంది అశోక్, ఉపాధ్యాయులు సమ్మయ్య, రాజయ్య, ప్రేమ్ కుమార్, రాధాబాయి, సరోజినీ దేవి, భవాని, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థి ఆత్మహత్యాయత్నం

నవతెలంగాణ-దుబ్బాక



తల్లిదండ్రులపై బెంగ చెందిన ఓ గురుకుల విద్యార్థి ఉరేసుకొని ఆత్మహత్యా యత్నానికి పాల్పడగా ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం హబ్సీపూర్‌లోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో శనివారం తెల్లవారుజామున జరిగింది. ప్రిన్సిపాల్ గోపాల్ రెడ్డి తెలిపిన వివరాలు.. దౌల్తాబాద్ మండలం గువ్వలేగి గ్రామానికి చెందిన బోయిని అఖిల్ (12) ఇదే పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. కొద్దిరోజులుగా తనని ఇంటికి తీసుకెళ్లాలంటూ, ఖర్చులకు కొంత డబ్బులు పంపాలని తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా కోరగా, మరి కొద్ది రోజుల తర్వాత తామే వస్తామని చెప్పడంతో మనస్థాపానికి గురైనాడు. శనివారం ఉదయం ఐదున్నర గంటల సమయంలో హాస్టల్ లోని బాత్రూం డోర్ సెట్టుకు నైలాన్ తాడుతో ఉరి వేసుకున్నాడు. గమనించిన తోటి విద్యార్థులు వెంటనే ఉపాధ్యాయుడు యాదగిరి, పీఈటీ తరుణ్ రాజ్ లకు చెప్పగా అఖిల్‌ను కిందకు దించి దుబ్బాకలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి, సిద్దిపేట జిల్లా ఆస్పత్రికి అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాదులోని నీలోఫర్ ఆసుపత్రికి తరలించార ని వివరించారు. ప్రస్తుతం విద్యార్థి అఖిల్ ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉన్నట్లు ప్రిన్సిపాల్ గోపాల్ రెడ్డి తెలిపారు. కాగా విషయం తెలుసుకున్న వెంటనే మహాత్మ జ్యోతిబా పూలే ఉమ్మడి మెదక్ జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ గౌతమ్ కుమార్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య, దుబ్బాక ఎస్ఐ వీ.గంగరాజు తన సిబ్బందితో కలిసి ఘటన స్థలిని పరిశీలించారు. ఘటనకు సంబంధించిన వివరాలను విద్యార్థులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలు తర్వాతే ఉద్యోగాలను భర్తీ చేయాలి

నవతెలంగాణ-చేర్యాల

ఎస్సీ వర్గీకరణ అమలు తర్వాతే ఉద్యోగాలను భర్తీ చేయాలని ఎంఎస్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎమ్మార్పీఎస్ చేర్యాల డివిజన్ ఇంచార్జి సనవాల ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేయనున్న గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, ఉద్యోగాలను, ఎస్సీ వర్గీకరణ అమలు జరిగే వరకు నిలిపి వేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన దీక్షలు శనివారం 3వ రోజు ఎంఈఎఫ్ జిల్లా కోశాధికారి చదరపల్లి నరేశ్ దండలు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సనవాల ప్రసాద్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తానని అసెంబ్లీ సాక్షిగా హామి ఇచ్చిన రేవంత్ రెడ్డి అమలు చేయకుండా ఉద్యోగ నియామకాలు చేపడుతూ మాదిగలకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణనకు చట్టబద్ధత కల్పించి అనంతరం ఉద్యోగ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేసారు. అప్పటివరకు దీక్షలు కొనసాగుతాయని, రాబోవు కాలంలో మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ రాష్ట్ర యువజన విభాగం నాయకులు కందుకూరి సిద్ది



లింగం దీక్ష శిబిరానికి వచ్చి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో భూమిగారి మధుకర్, ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షుడు గడిపే బాల్ నర్సయ్య, సీనియర్ నాయకులు బండ ఐలయ్య , మండల నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, మండల నాయకులు మల్లిగారి నర్సింహులు, ఎర్రమైసగల్ల రమేష్, ముస్త్యాల కుమార్,గుడ్ల నర్సింహులు, కుర్రోళ్ళ యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-సిద్ది పేటకలెక్టరేట్

ఎస్సీ వర్గీకరణ చట్టం అమలు అయ్యేంతవరకు ఉద్యోగ నియామకాలు ఆపాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కపల్లి రాజు మాదిగ అన్నారు. జిల్లా కలెక్టరేట్ ముందు ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని అమలు చెయ్యకుండా ఉద్యోగ



నియామకాలు చేపడుతున్న రాష్ట్ర ప్రభుత్వం తీరును నిరసిస్తూ జరుగుతున్న నిరసన దీక్షలు శనివారం నాలుగో రోజుకు చేరినాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి మాలల ఒత్తిడికి తలొగ్గి మాదిగలను మోసం చేస్తున్నాడని, దీనికి సాక్ష్యం నిండు అసెంబ్లీలో రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటలు మీద నిలబడకపోవడమన్నారు. గతంలో ఇచ్చిన నోటిఫికేషన్లకు కూడా వర్గీకరణ అమలు చేసి మాదిగలకు న్యాయం చేస్తామని చెప్పింది వాస్తవం కదా అని ప్రశ్నించారు. మాదిగలకు అన్యాయం చేస్తూ ఉద్యోగ నియామకాలు జరపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించినారు. ఈ దీక్షలో ఎంఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీహరి సింధు, ఎంఎస్పీ సీనియర్ నాయకులు దుబ్బాక నియోజకవర్గం ఇస్తారు గల ఏళ్లం మాదిగ, ఎంఎస్పీ దుబ్బాక మండల ఉపాధ్యక్షులు జనగామ విజయ్ కుమార్ మాదిగ, ఎంఎస్‌పీ మండల ఉపాధ్యక్షులు చెక్కపల్లి మహేష్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్ కాంగ్రెస్‌లో సయోధ్య

- నామినేటెడ్ పదవులపై మరోసారి కీలక భేటీ
- పార్టీ అధిష్టానం ఒత్తిడితో చేతులు కలిపాం
- గజ్వేల్లో కేసీఆర్ ఉన్నారు జాగ్రత్త
- ఇరు వర్గాలకు మధ్యవర్తి మైనంపల్లి

నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ నియోజకవర్గంలో అధికార కాంగ్రెస్ లోని వర్గాల మధ్య సయోధ్య కుదిరింది. మేడ్చల్ జిల్లా కొంపల్లి గ్రామంలో ఉన్న ఓ దేవాలయంలో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఇరు వర్గాలను కలిపేందుకు చేసిన ప్రయత్నం ఫలించింది. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, పీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్ రావు రెండు వర్గాలుగా చీలిపోయి పార్టీ కార్యక్రమాలు వేరువేరుగా నిర్వహించుకున్నారు. విలేకరుల సమావేశాలు నిర్వహించి తిట్ల పురాణం పెట్టుకున్నారు. శ్రీకాంత్ రావు వర్గంపై పీసీసీ చీఫ్ మహేష్ కుమార్, గజ్వేల్‌కు వచ్చిన పరిశీలకులకు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి పార్టీ పరిస్థితిని వివరిస్తూ ముందుకు వచ్చారు. దీనిపై పార్టీ అధిష్టానం సీరియస్ గా తీసుకొని గజ్వేల్ నియోజకవర్గంలో గ్రూప్లో గోలకు చెక్కు పెట్టాలని ఇటీవల రాష్ట్రానికి ఇంచార్జిగా వచ్చిన మీనాక్షి నటరాజన్ సీరియస్‌గా జిల్లా మంత్రులు దామోదర్ రాజనర్సింహకు వార్నింగ్ ఇచ్చింది. సిద్దిపేట జిల్లాలో గజ్వేల్, సిద్దిపేట ఇతర ప్రాంతాల్లో ఉన్న పార్టీల మనస్పర్థలను సమస్య పోయేలా చూడాలని ఆదేశాలు జారీ చేసింది. గజ్వేల్ సిద్దిపేట నియోజకవర్గంలో ఉన్న పార్టీలో విభేదాలను పరిష్కారానికి మైనంపల్లి ముందుండి పరిష్కారానికి మార్గాలు చూపుతున్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో మిగిలిన నామినేటెడ్ పదవులు భర్తీ విషయంలో ఇరు వర్గాల మధ్య గందరగోళంతో వాటిని నిలిపివేశారు. సయోధ్య కుదరడంతో త్వరలోనే నామినేటెడ్ పదవులు భర్తీ అయ్యే అవకాశం ఉంది. గజ్వేల్‌లో మాజీ సీఎం కేసీఆర్ శాసనసభ్యులుగా ఉన్న విషయాన్ని కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు మర్చిపోవద్దని, ఆ పార్టీ నాయకులను ఢీ కొట్టాలంటే మీరంతా ఏకమై ఉండాలని అధిష్టానం గట్టి వార్నింగ్ ఇచ్చింది.

నవతెలంగాణతో నాయకులు

పార్టీ అధిష్టానం ఆదేశమే కలిపింది. గజ్వేల్ నియోజకవర్గంలో కాంగ్రెస్లో నెలకొన్న అంతర్గత విభేదాలు పార్టీని నష్టం చేస్తుందని పార్టీ అధిష్టానం ఆదేశంతో కలిసిపోయినట్లు ఆ పార్టీకి చెందిన రాష్ట్ర నాయకులు నవతెలంగాణతో తెలిపారు.



క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తేనే ఉన్నత స్థాయి

నవతెలంగాణ-రాయపోల్



విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసిస్తే జీవితంలో ఉన్నత స్థాయికి ఎదుగుతారని యుఎస్ఎఫ్ఐ (భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్) దుబ్బాక నియోజకవర్గ అధ్యక్షులు పాపగారి నరేష్ అన్నారు. శనివారం రాయపోల్ మండల కేంద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు చదివే విధానం, వారి పరిస్థితులు, స్థితిగతులను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువులో రాణించాలంటే ప్రణాళికబద్ధంగా ముందుకు పోవాలని, పాఠశాలలో చక్కటి వాతావరణం, విద్యను బోధించడానికి చక్కటి ఉపాధ్యాయులు, ప్రభుత్వం మధ్యాహ్న భోజనం అందిస్తుందన్నారు. భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ ద్వారా సుమారు 20 మంది విద్యార్థులకు డ్రెస్సులు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగరాజు, కార్యదర్శి సతీష్, నరేష్, ఉపాధ్యాయులు, పీఈటీ గోవర్ధన్ రెడ్డి లు పాల్గొన్నారు.

కాలువ పనుల పునరుద్ధరణ

-మట్టి, బండరాళ్ళను తొలగించిన ఇరిగేషన్‌శాఖ అధికారులు
-"మంత్రి, కలెక్టర్ మాటలు భేఖాతర్" వార్తకు స్పందన







నవతెలంగాణ-కోహెడ

మండలంలోని శనిగరం ప్రాజెక్ట్ నుంచి వింజపల్లి, రాంచంద్రాపూర్ గ్రామలకు నీటిని విడుదల చేయాలని, పంటలు ఎండిపోతున్నాయని రైతులు, గ్రామస్థులు తెలపడంతో శుక్రవారం నవతెలంగాణలో ప్రచురితమైన "మంత్రి, కలెక్టర్ మాటలు భేఖాతర్" వార్తకు స్పందించి అధికారులు కాలువను సవరించారు. శనివారం కాలువ వద్దకు ఇరిగేషన్ శాఖ ఈఈ రమేష్, డీఈ రేష్మ, ఏఈ రవీష్‌లు హాజరై పరిశీలించారు. అలాగే గ్రామపంచాయితీ సిబ్బందితో మట్టి, బండరాళ్ళను తొలగించి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ శాఖ అధికారులు మాట్లాడుతూ.. ప్రభుత్వ అనుమతి లేకుండా కాలువల్లో మట్టి, బండరాళ్ళు, తదితర వస్తువులు వేసి కాలువలను ధ్వంసం చెస్తే చట్టరీత్య చర్యలు తప్పవని హెచ్చరించారు.

డబుల్ బెడ్ రూమ్ స్థలాల్లో ఫామ్ హౌస్

-ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణా కట్టడాలపై చర్యలు తీసుకోండి
-ఎంపీఓ విష్ణువర్ధన్‌కు వినతి పత్రం



నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

ప్రభుత్వ భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణా కట్టడాలపై చర్యలు తీసుకోవాలని చిన్నకోడూరు మండలం ఎల్లాయిపల్లి గ్రామానికి చెందిన తోట్ల నరసింగం అన్నారు. శనివారం సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని ఇరుకొడు గ్రామ పరిధిలో ఉన్న సర్వేనెంబర్ 278లో ఉన్న ప్రభుత్వ భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రూరల్ ఎంపీవో విష్ణువర్ధన్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో పేద ప్రజలకు కేటాయించిన ప్రభుత్వ స్థలంలో అక్రమంగా ఎటువంటి ఆధారాలు లేకుండా రాజకీయ నాయకుల అండతో గౌరిశెట్టి బాలకిషన్ అనే వ్యక్తి ఫామ్ హౌజ్ నిర్మాణం చేపట్టాడన్నారు. ఆయనతోపాటు అనేకమంది ప్రభుత్వ స్థలాలు కబ్జా చేసి ఇండ్ల నిర్మాణం చేపట్టారని ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి వాటిపైన విచారణ చేపట్టి అక్రమ నిర్మాణాలను తొలగించి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం : చెరుకు



నవతెలంగాణ-దుబ్బాక

సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ సర్కార్ పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం దుబ్బాక మున్సిపల్ పరిధిలోని సీఎస్ఆర్ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని లబ్ధిదారులకు మంజూరైన రూ.31,91,500 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఆయన వెంట కూడవెళ్లి ఆలయ చైర్మెన్ ఉషయ్యగారి రాజిరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ గజభీంకార్ బాలరాజు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు అనంతుల శ్రీనివాస్, దుబ్బాక మున్సిపల్, మండలాధ్యక్షులు ఏసురెడ్డి, కొంగర రవి, ఉపాధ్యక్షులు నరేందర్ రెడ్డి, ఆకుల భరత్ పలువురున్నారు.

ఏఐతో అభ్యసన సామర్థ్యాలు పెంపు

నవతెలంగాణ-దుబ్బాక



ఏఐ టెక్నాలజీ సహకారంతో విద్యార్థులు తమ అభ్యసన సామర్థ్యాలను మరింతగా పెంపొందించుకోవచ్చని మండల విద్యాధికారి జోగు ప్రభుదాస్ అన్నారు. శనివారం దుబ్బాక మున్సిపల్ పరిధిలోని దుంపలపల్లి జడ్పీహెచ్ఎస్‌లో ఎంపీపీఎస్ విద్యార్థుల కోసం 'ఎక్స్ స్టెప్ సహకారంతో' ఏర్పాటు చేసిన ఏఐ సాఫ్ట్ వేర్ కంప్యూటర్ల గదిని ఎంఈఓ ప్రభుదాస్‌తో కలిసి ఎంపీడీవో వేలేటి భాస్కర శర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ఈ టెక్నాలజీ మరింతగా ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఏపీసీ చైర్ పర్సన్ గుండెబోయిన స్వప్న, మున్సిపల్ ఏఈ శ్రీకాంత్, ఎంపీపీఎస్ హెచ్ఎం నాగేశ్వరరావు, ఉపాధ్యాయ బృందం, పలువురు పాల్గొన్నారు

నిందితులను బైండోవర్ చేసిన పోలీసులు



నవతెలంగాణ-మర్కుక్

మర్కుక్ మండలంలోని పరిశ్రమ స్థలాల్లో ఉన్న తుప్పు పట్టిన ఇనుమును ఎవరికి తెలియకుండా ముగ్గురు దుండగులు దొంగిలించి సొమ్ము చేసుకుంటున్నారన్న సమాచారంతో పోలీసులు శనివారం వారిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ దామోదర్ తెలిపిన వివరాల ప్రకారం.. మర్కుక్ మండలంలోని కర్కపట్ల గ్రామంలోని శివారు ప్రాంతంలో గల పరిశ్రమల ఆవరణలలో ఉన్న తుప్పు పట్టిన ఇనుము దొంగిలించి సొమ్ము చేసుకుంటున్నారన్న సమాచారం మేరకు ముగ్గురు అనుమానితులను పట్టుకొని మర్కుక్ తహసిల్దార్ ప్రవీణ్ రెడ్డి ముందు బైండోవర్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

రాములోరి పెళ్లికి గోటి తలంబ్రాలు సిద్ధం : రామరాజు



నవతెలంగాణ-దుబ్బాక

భద్రాచల రాములోరి పెళ్లికి 250 కిలోల గోటి తలంబ్రాలను సిద్ధం చేస్తున్నట్లు రామకోటి భక్త సమాజం అధ్యక్షులు రామకోటి రామరాజు తెలిపారు. శనివారం దుబ్బాకలోని వెంకటేశ్వరాలయంలో 300 మంది భక్తులచే గోటితో ఒలిచిన వడ్లను సేకరించడం జరిగిందన్నారు. తమ సంస్థ ద్వారా గత 26 ఏళ్ల నుంచి ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అచ్చి లక్ష్మీ నర్సింహ ఆచార్య, ఆలయ కమిటీ సభ్యులు రామరాజును శాలువాతో సత్కరించారు.

మామూళ్లేనా..?



- టాస్క్ ఫోర్స్ వచ్చేంతవరకు స్థానిక అధికారులేమి చేస్తున్నారంటూ ఆరోపణలు
- అధికారుల కనుసైగల్లోనే అక్రమాలంటూ విమర్శలు..
- కఠిన చర్యలు చేపట్టడంలో జిల్లాధికారులు విఫలమంటూ కితాబు..
- సుమారు 150 టన్నుల అక్రమ ఇసుక నిల్వల స్వాధీనం

నవతెలంగాణ-బెజ్జంకి

మోయతుమ్మెద వాగు పరిసర ప్రాంతాల రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోయినా, భూగర్భ జలాలు అడుగంటినా..త్రాగు నీరుకు కరువచ్చినా.. టాస్క్ ఫోర్స్ అధికారులు, స్థానిక అధికారులు డేటా కళ్లతో నిఘా పెట్టిన, ఇసుక అక్రమ నిల్వలపై టాస్క్ ఫోర్స్ అధికారులు కీలకంగా మారిన ఈ తతంగమంత మామూళ్లేనంటూ అధికార పార్టీ నాయకులు ఇసుక అక్రమ దందాకు పాల్పడుతుండడం గమనార్హం.

టాస్క్ ఫోర్స్ వాళ్లే అధికారులా..?

మండలంలోని అధికారులు ఏం చేస్తున్నారో ఏవరికి అంతు పట్టడం లేదు. అక్రమ ఇసుక రవాణకు అడ్డుకట్ట వేశామని చెబుతున్నారు. కానీ క్షేత్ర స్థాయిలో ఇసుక నియంత్రణ జరగడంలేదు. మట్టి రవాణ కనులముందే జరుగుతోంది. ప్రతి నెల పీడీఎస్ బియ్యం రవాణ సాగుతోంది. మండలంలో ఎదో ఒక మూలన ప్రతి రోజు పేకాట స్థావరం నిర్వహిస్తూనే ఉన్నారు. మండలంలో అక్రమ, చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నాయనే విమర్శలు ప్రజల్లో వినిపిస్తూనే ఉన్నాయి. ఎవరూ బాహాటంగా చెప్పలేని పరిస్థితి. జిల్లా కేంద్రంలో ఉన్న టాస్క్ ఫోర్స్ అధికారులు సుమారు 45 కిలో మీటర్ల దూరంలో ఉన్న మండలానికి వచ్చి ఇసుక అక్రమ రవాణ చేస్తున్న ట్రాక్టర్లు, ఇసుక అక్రమ నిల్వలు, గుట్టుగా సాగుతున్న పీడీఎస్ బియ్యం కొనుగోళ్లు, పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించి పట్టుకుంటున్నారు. అంత దూరం నుంచి టాస్క్ ఫోర్స్ అధికారులు వచ్చి అక్రమ కార్యకలాపాలపై కొరడా ఝులిపిస్తుంటే స్థానిక అధికారులు విధుల నిర్వహణలో ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో ప్రజలందరికి అర్థమవుతోంది.

అధికారుల ప్రోద్బలంతోనే..

ఇసుక అక్రమ నిల్వలు, ఇసుక రవాణ, పీడీఎస్ బియ్యం కొనుగోల్లు, పేకాట స్థావరాల నిర్వహణ వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు వంటివి స్థానిక అధికారుల ప్రోద్బలంతోనే సాగుతున్నాయని వాటిని అరికట్టడంలో జిల్లాధికారులు విఫలమయ్యారంటూ పలువురు కితాబిస్తున్నారు.ఇంత జరుగుతున్న జిల్లా అధికారులు సైతం స్థానిక మండల అధికారులపై కఠిన చర్యలు చేపట్టడంలో వెనుకంజ వేయడంతో అక్రమ కార్యకలాపాలకు జిల్లా అధికారులు సైతం వంతపాడుతున్నారనే అపవాదును ప్రజల్లో మూటగట్టుకున్నారు.ఇప్పటికైనా జిల్లా అధికారులు ప్రజల్లో మూటగట్టుకున్న అపవాదును స్వార్థకతమవ్వకుండా అక్రమాలకు వంతపాడుతున్న అధికారులపై కఠిన చర్యలు చేపట్టాలని పలువురు సూచిస్తున్నారు.

ఇసుకను అక్రమంగా నిలువ చేయడం, నిల్వ చేసిన అక్రమ ఇసుక నిల్వలపై టాస్క్ ఫోర్స్ అధికారులు దాడి చేయడం, అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను స్వాధీనం చేసుకున్నామని ప్రకటించడం, ఇది మండలంలో గత కొద్దేండ్లుగా సాగుతున్న సాధారణ తతంగం. ఏండ్లుగా సాగుతున్న ఇసుక అక్రమ రవాణ స్థానిక అధికారులకు తెలియదని అనుకుంటే పొరపాటు పడినట్టే. ఇదంత అధికారుల కళ్లముందే జరుగుతున్న కనీసం పట్టించుకోకపోవడం మాములుగానే మారింది. తహసీల్దార్ ఇసుక అక్రమ రవాణకు అడ్డుకట్ట వేసిన కొందరు అధికార పార్టీ నాయకులు ఇసుక అక్రమ దందాకు తెరలేపుతుండడం పరిపాటిగా మారింది. నిఖచ్చితంగా అధికారులు విధులు నిర్వహిస్తే మేం అధికార పార్టీ మంత్రి, ఎమ్మెల్యే అనుచరులమంటూ పలువురు అధికారులపై బెదిరింపులకు పాల్పడుతున్నట్టు సమాచారం. ఉద్యోగం చేయాలంటే మేము చెప్పినట్టా అధికారులు నడుచు కోవాల్సిందేనని.. లేదంటే స్థాన చలనం తప్పదని హెచ్చరిస్తున్నటు వినికిడి.

150 టన్నుల ఇసుక అక్రమ నిల్వలు స్వాధీనం..

మండల పరిధిలోని తోటపల్లి గ్రామ శివారులోని రామాలయం వెనుక వైపు వెంచర్ యందు గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా నిల్వ చేసిన సుమారు 150 టన్నుల ఇసుక నిల్వలను పోలీసులతో కలిసి స్వాధీనం చేసుకున్నామని శనివారం టాస్క్ ఫోర్స్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.



జిల్లాలో స్కిల్ అభివృద్ధి కమిటీ క్వార్టర్లీ సమావేశం

నవతెలంగాణ-సిద్దిపేటకలెక్టరేట్



జిల్లా కలెక్టరేట్లో కాన్ఫరెన్స్ హాల్లో డిస్టిక్ స్కిల్ కమిటీ క్వార్టర్లీ సమావేశం జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అధ్యక్షతన శనివారం జరిగింది. జిల్లాలోని స్కిల్ గ్యాప్ మీద చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని నిరుద్యోగ అభ్యర్థులు, డిగ్రీ, పై స్థాయి చదువులు చదువుకునే వారికి స్కిల్ మీద అవగాహన కల్పించడం కోసం ఈ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నాం. వీరికి శిక్షణ కోసం డీఆర్డిఓ, పరిశ్రమల కేంద్రం, సెట్విన్, కార్మిక శాఖ, ఉపాధి, శిక్షణ శాఖల ఉమ్మడి భాగస్వామ్యంతో నిర్మాణ రంగంలో ట్రైలరింగ్, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం మేస్త్రీలు ట్రెనింగ్, లేబర్ ట్రెనింగు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మొదలైన రంగాల్లో శిక్షణ ఇవ్వడం కోసం శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు నిర్వహించాలని సూచించారు. నిర్మాణరంగమే కాకుండా బ్యాంకింగ్ ఇతర రంగాల్లో కూడా వీరికి శిక్షణ ఇవ్వడం కోసం పర్సనాలిటీ డెవలప్మెంట్ క్లాసెస్ నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో శిక్షణ పొందిన ప్రతి ఒక్కరికి ఉపాధి లభించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా డీఆర్డిఓ జయదేవ్, జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లా మైనార్టీ బీసీ వెల్ఫేర్ అధికారి నాగరాజమ్మ, జిల్లా వ్యవసాయ అధికారి రాధిక, జిల్లా సెట్విన్ కోఆర్డినేటర్ అమీనాభాను, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు

కొమురవెల్లిలో జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలి

- ఎమ్మార్వో ఆఫీస్ సిబ్బందికి వినతి పత్రం
- ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి తాడూరి భరత్



నవతెలంగాణ-కొమురవెల్లి

కొమురవెల్లి మండలంలోజూనియర్ కళాశాల, ఎస్సీ, బీసీ, హాస్టల్‌లు ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి తాడూరి భరత్ కుమార్ డిమాండ్ చేశారు. భారత విద్యార్థి ఫెడరేషన్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మార్వో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి వినతి పత్రం అందించారు. అనంతరం భరత్ కుమార్ మాట్లాడుతూ.. కొమురవెల్లి మండలం ఏర్పాటుచేసి 8 ఏళ్లు అవుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదని, ఎంతోమంది విద్యార్థులు ఇంటికే పరిమితం అవుతున్నారన్నారు. విద్యార్థులు చదువుకునే వయసులో నాణ్యమైన విద్య లేక ఇంటిదగ్గర పనులకు ఆ విద్యార్థులు పరిమితమైతు న్నారన్నారు. వెంటనే మండల విద్యాశాఖ అధికారులు ఈ సమస్య మీద స్పందించాలని డిమాండ్ చేశారు. విద్యాహక్కు చట్టం ప్రకారం విద్యార్థులు 18 ఏళ్లు నిండే వరకు చదువుకొంటూ ఉండాలన్నారు. మండలం ఏర్పడి ఇన్ని రోజులైనా ఇక్కడ జూనియర్ కాలేజీ లేకపోవడం విద్యాశాఖ నిర్లక్ష్యమే అన్నారు. ఇప్పటికైనా జూనియర్ కళాశాల, ఎస్సీ ,బీసీ హాస్టల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఎస్ఎఫ్ఐ విద్యార్థులతో మండలంలో పెద్ద ఎత్తున ఉద్యమ పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు తాడూరి ప్రకాష్, సమీర్, రాజు, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

చెడు ఆలోచనలకు తావియ్యొద్దు : ఎస్ఐ పి.నీరీష్

నవతెలంగాణ-చేర్యాల



చదువుకునే సమయంలో ఎలాంటి చెడు ఆలోచనలకు తావియ్యకూడదని, అవసరమైన మేరకు మాత్రమే సోషల్ మీడియా ఉపయోగించాలని చేర్యాల ఎస్ఐ పి.నీరీష్ అన్నారు. మండల పరిధిలోని తాడూరు జిల్లా పరిషత్ హై స్కూల్‌లో శనివారం విద్యార్థినీ, విద్యార్థులకు మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, సైబర్ నేరాలు, గుడ్ టచ్ బాడ్ టచ్, గంజాయి ఇతర మత్తు పదార్థాలు, ఈవిటీజింగ్ నూతన చట్టాల గూర్చి ఎస్ఐ, హుస్నాబాద్ షీటీమ్ బృందం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలన్నారు. మైనర్ డ్రైవింగ్ ప్రమాదకరమని, చట్ట ప్రకారం నేరమని తెలిపారు. బ్యాంకు అధికారులు ఎవరూ మన వివరాలు ఎప్పుడు కూడా అడగరని, ఇలా అడిగి ఎవరైనా ఫోన్ చేస్తే తప్పకుండా సైబర్ నేరమని వెంటనే ఆ ఫోన్ కట్ చేసి వచ్చిన నెంబర్‌ను బ్లాక్ చేయాలన్నారు. సైబర్ నేరాల బారిన పడితే 1930 కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపా ధ్యాయులు శ్రీరాములు, ఉపాధ్యాయులు, హుస్నాబాద్ షీటీమ్ బృందం సదయ్య ,హెడ్ కానిస్టేబుల్, మహిళ కానిస్టేబుల్ ప్రశాంతి, కానిస్టేబుల్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జగదీష్ రెడ్డి శాసన సభ సభ్యత్వం రద్దు చేయండి

- రాజ్యాంగ పదవిలో ఉన్న స్పీకర్ ను దూషించడం సిగ్గుచేటు
- డీసీసీ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్

బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డిని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడం కాకుండా ఆయన శాసన సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేటీఆర్ ఆమరణ దీక్ష చేస్తాననడం దయ్యాలు వేదాలు వల్లించడమే అవుతుందని ఎద్దేవా చేశారు. అయితే గతంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే సంపత్ కుమార్, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శాసన సభ సభ్యత్వాలను రద్దు చేసిన విషయాన్ని కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులు గుర్తుకు తెచ్చుకోవాలని విమర్శించారు. రాజ్యాంగ పదవిలో ఉన్న స్పీకర్ ను అగౌరవపరచడం సిగ్గుచేటు కాగా, ఆయనకు క్షమాపణ చెప్పాల్సింది పోయి ఆందోళనల పేరిట రోడ్డున పడడం తగదని నిలదీశారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ పార్టీకి దళితుల పట్ల ఉన్న ప్రేమను ప్రజలు, దళిత సమాజం అర్థం చేసుకోవాలని వివరించారు.

అంతర్జాతీయ హక్కుల దినోత్సవంపై అవగాహన సదస్సు

నవతెలంగాణ-గజ్వేల్





ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల గజ్వేల్ నందు అంతర్జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం పురస్కరించుకొని వినియోగదారుల క్లబ్ మహిళ సాధికారత విభాగం వారు సంయుక్తంగా ఇన్నెర్ గ్లోబల్ ఫౌండేషన్ వారి సహకారంతో వినియోగదారుల హక్కులపై, మహిళల హక్కులపై అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.శ్రీలత అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల్ లీగల్ కమిటీ చైర్ పర్సన్ అదనపు జూనియర్ సివిల్ జడ్జి. బి. ప్రియాంక హాజరై వినియోగదారుని హక్కులు, ఆన్లైన్ కొనుగోలు మోసాలు, మహిళల రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. గజ్వేల్ సీఐ సైదా మాట్లాడుతూ.. మహిళల పట్ల జరుగుతున్న నేరాలను చెబుతూ ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, డ్రగ్స్ నివారణ చర్యల గురించి, లైంగిక వేధింపుల గురించి, పోక్సో చట్టం, షీ టీం, భరోసా సఖి సెంటర్లు వాటి నుంచి అందే సేవలను అందుకోవాలని వాటి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్నెర్ గ్లోబల్ ఫౌండేషన్ అధ్యక్షులు పి.గోపాల్, ఉపాధ్యక్షులు కె.వినోద్ ఐ.క్యూ.ఏ.సి.కో-ఆర్డినేటర్ ఎమ్.ఎమ్ .లక్ష్మి, మహిళా సాధికారత విభాగం కన్వీనర్ డాక్టర్ డి .సుజాత, వాణిజ్య విభాగం తరపున వి.సరోజన ,పి.నరేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల గజ్వేల్‌లో ..

ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం మార్చి 15 సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల గజ్వేల్‌లో శనివారం కళాశాలలోని వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు వినియోగదారుల హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ నికత్ అంజుమ్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు వినియోగదారులకు కలిగే సమస్యలను పరిష్కరించుకుంటూ చుట్టూ ఉన్న సమాజంలోని వినియోగదారులకు వారి హక్కులపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వాణిజ్య విభాగాధిపతి జే.లక్ష్మి నర్సయ్య మాట్లాడుతూ.. వినియోగదారుల సమస్యలపై పరిష్కారం కోరడానికి అనే పోర్టల్ ద్వారా లేదా వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 1915 కి కాల్ చేసి లేదా 8800001915 కి వాట్సప్ చేయడం ద్వారా కూడా పరిష్కారం పొందవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీ వి. మార్కండేయ, శ్రీ ఎస్.శ్రీధర్ విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశభక్తి సాంప్రదాయాలను పెంపొందించే విధంగా బోధనలు

- చదువుతోపాటు ఆచార సాంప్రదాయాలపై అవగాహన



నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్

నిరంతరం చదువులపై మార్కుల ఆధారంగా విద్యార్థులను పోల్చకుండా చదువుతోపాటుగా దేశభక్తి ఆచార సాంప్రదాయాలపై కూడా శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయంలో బోధనలు ఉంటాయని విద్యాలయ స్థాపకుడు, చైర్మెన్ తడకమడ్ల ఈశ్వరయ్య అన్నారు. శనివారం సిద్దిపేట అర్బన్ మండలం, తడకపల్లిలో శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయంలో 43వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు, సాంప్రదాయ చిరుతల నృత్యం, ప్రాచీన మలకంబు విన్యాసాలు, చెక్కభజన పలువురుని ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈశ్వరయ్య కార్యదర్శి సాంబశివరావులు మాట్లాడుతూ.. మానసికంగా శారీరకంగా ఆధ్యాత్మికంగా విద్యార్థులను పైకి తీసుకురావడానికి తమ పాఠశాలలో విద్యాబోధన కొనసాగుతుందని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు బైరి శంకర్, ప్రముఖ డాక్టర్ శివరామ చారి, సురభి మెడికల్ కళాశాల పీఆర్ఓ పరశు రాములు, ఆవాస విద్యాలయ ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



ఐక్యమత్యంగా ఉంటే అధికారం మనదే..!

- బీఎస్పీ నియోజకవర్గ ఇన్చార్జి రవీందర్ గౌడ్

నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్

దేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలు మైనార్టీలు ఐక్యమత్యంగా ఉంటే అధికారం ఎప్పుడూ మన చేతుల్లోనే ఉంటుందని బీఎస్పీ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్ అన్నారు. శనివారం హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఎస్పీ వ్యవస్థాపకులు మాన్యశ్రీ కాన్షిరాం 91వ జయంతి ఘనంగా నిర్వహించారు. బీఎస్పీ నాయకులతోపాటు అఖిల పక్ష పార్టీ నాయకులు జయంతి ఉత్సవాల్లో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ అధికార ప్రతినిధి ఐలేని మల్లికార్జున్ రెడ్డి, రాష్ట్ర బీసీ నాయకులు బుర్ర శ్రీనివాస్ గౌడ్, నాయకులు మారేపల్లి సుధాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలగందుల శంకర్, నియోజకవర్గ అధ్యక్షులు వేల్పుల రాజు, బీఎస్పీ మహిళా అధ్యక్షులు పులి నీరజ, మాజీ కౌన్సిలర్ బీసీ నాయకులు ఇంద్రాల సారయ్య, శ్యామ్ సుందర్, మల్లం విక్రం, తదితరులు పాల్గొన్నారు.

